జూన్ - 2025

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| ఐ లవ్ యు సోమచ్ | కె.ఇ. రాజేంద్ర | 07 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 08 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| శ్రీమతి రత్నకుమారి | సాక్ష్యము | 10 |
| మదర్‌తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా | హన్నాకృప డెస్క్ | 17 |
| ప్రార్ధనా జీవితము | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| దేవుని సహాయం | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-06 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,


**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం.51, క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890




| సీరియల్ నంబరు | |
|---|---|

సంపాదకీయం....

# యెహోవా నీ కాపరి

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

కాపరి అనగా కాపలా కాసేవాడు. కాపలా కాసేవాడు కునుకు తీయకుండా క్రూర మృగముల నుండి కాపాడటానికి అనుక్షణం కనిపెట్టుకొని ఉంటాడు. పసిపిల్లలను తల్లి ఎలా కనిపెట్టుకొని ఉంటుందో అలా ప్రతి కదలికను కనిపెడుతూ ఉంటాడు. ఆయన తన స్వరముతో గొఱ్ఱెలను పిలిచినప్పుడు అవి కాపరి స్వరమును గుర్తించి ఆయన వెంబడి వెళ్తాయి. మనం దేవుని గొఱ్ఱెలుగా ఉంటే ఆయన స్వరమును గుర్తించి ఆయనను వెంబడిస్తాము. యోహాను సువార్త 10:14లో యేసు "నేను గొఱ్ఱెల మంచి కాపరిని" అని, 27వ వచనంలో "నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును" అని చెప్పున్నాడు. దేవుడు మనకు మంచి గొఱ్ఱెల కాపరి అన్నది సరే, మరి మనం దేవుని గొఱ్ఱెలుగా ఉంటున్నామా లేదా అన్నది మనకు తెలియాలి. *"నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలో నుండి అపహరింపడు" (యోహాను 10:27,28).* మనం ఈ లోకాన్ని వెంబడిస్తున్నామా? దేవున్ని వెంబడిస్తు న్నామా? అన్నదాన్నిబట్టి మన జీవితం ఉంటుంది. మనం దేవుని గొఱ్ఱెలుగా ఉంటే, మనం ఆయన స్వరము ఎరిగి, ఆయనను వెంబడిస్తాము. అప్పుడు ఆయన మనకు నిత్య జీవమునిస్తాడు. మనం ఆయన దొడ్డిలో ఉంటే నిశ్చింతగా, నిర్భయంగా జీవిస్తాము. పచ్చిక గలచోట్ల ఆయన మనలను పరుండజేస్తాడు. అనగా సమృద్ధి జీవితం మనకు అనుగ్రహిస్తాడు. మనకు లేమి కలుగదు. అనగా మనకు ఎలాంటి లోటు ఉండదు. శాంతికరమైన జలముల చెంత మనల్ని నడిపిస్తాడు. అనగా ఎలాంటి అలజడులు లేని ప్రశాంతమైన జీవితాన్ని అనుగ్రహిస్తాడు. ఇదంతా దేవుడు మనకి కాపరిగా ఉంటేనే జరుగుతుంది. మనం దేవుని కాపుదలలో లేకపోతే ఈ లోకంలో మనకు భద్రత ఉండదు. "మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" (1పేతురు 5:8). దేవుని కాపుదలలో లేనివారిని మ్రింగటానికి సాతాను కాచుకొని ఉన్నాడు. ఈ భూమి మీద పుట్టిన ప్రతి ఒక్కరూ దేవుని గొఱ్ఱెలే. అయితే ఆయన దొడ్డిలో ఉండకుండా, కాపరి రక్షణలో లేకుండా ఇష్టానుసారంగా ఉండటం వలన గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచున్న అపవాదికి చిక్కి నాశనమవుతున్నారు. దేవుడు మనకి స్వేచ్ఛ ఇచ్చాడు కాబట్టి మనంతట మనమే ఆయన కాపుదలలోకి వెళ్ళాలి. ఆయన కాపుదలలో ఉన్నవాళ్ళని ఆయన అనుక్షణం కాపాడుతుంటాడు. ఆయన మన కాపరిగా ఉంటే ఎంత ధైర్యంగా ఉంటామంటే, గాఢాంధకారపు లోయ అనబడే ఈ లోకంలో మనం నివశిస్తున్నప్పటికీ ఎలాంటి అపాయము వస్తుందన్న భయం లేకుండా ఉంటాము. ఈ లోకమంటేనే అపాయాల పుట్ట. సాతాను ఏ వైపు నుండి వచ్చి దాడి చేస్తాడో ఎప్పుడు ఏం జరుగుతుందో మనకి తెలియదు. కాబట్టి మనం ఈ లోకంలో జీవించినంత కాలము ఈ లోకాధికారియైన సాతాను నుండి తప్పించబడాలంటే మంచి కాపరియైన యేసుప్రభువు కాపుదలలో సంరక్షణలో ఉండాలి. మరి నీవు యేసుని నీ కాపరిగా అంగీకరించి, ఆయన సంరక్షణలోనికి రావడానికి సిద్ధమేనా?

**- కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్



# జప్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**

**- కొడవటికంటి**

పోతీఫెర అది విననట్లుగానే వెనక్కి తిరిగి తన ఇంటి వైపు అక్షాపుతో సహా అడుగులు వేశాడు. "నిజమే సుమా! ఫరో పొందిన ఈ సంతోషంలో నేను ఏమి ఆలోచించనే లేదు. అయితే ఫరో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆగిపోవటానికి వీలులేదు. యోసేపుగారి విషయం నాకు ఏమి తెలియదు. ఆయనతో ఒక్కసారి కూడ నేను మాట్లాడియుండ లేదు. మరి ఆయనకి తగిన వధువును ఇప్పుడు ఎక్కడ తీసుకొని రాగలము? మీరు వారికి ఉపాధ్యాయులుగా ఉన్నారట కదా! అదీగాక మీరు వారితో ఈ విషయాలు మాట్లాడగలిగిన చనువుగలవారు కదా! దయవుంచి సాయంకాలం ఆలయానికి మీరు వచ్చేముందు వారితో మాట్లాడి వస్తారా?" అని అన్నాడు.

"మాట్లాడి వస్తాను. నేను ఇప్పుడు మీ యింటికి అంటే మీతో మాట్లాడాలనుకుంటున్న వస్తున్న విషయం ఇది కాదు!" అని ఆగాడు. పోతీఫెర వింటూ నడుస్తున్నాడు.

"సాయంకాలం ఓను దేవాలయంలో పూజ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత, మరో కార్యక్రమం మొదలుపెట్టక ముందే, యోసేపుగారు తమ ఇంటిలో కొంచెం విశ్రాంతి తీసుకుంటారు. ఎందుకంటే ఓనుకు ఆయన నమస్కరించరు. కనుక మీరు పూజలు చేసే సమయంలో దేవాలయంలో ఉండకుండా ఆయన తరపున ఎవరినైనా ఆలయంలో ఉంచి, ఆయన ఒక విధంగా విశ్రాంతి తీసుకుంటారు. ఈ విషయంలో మీ సహాయం కోరటానికి నేను వచ్చాను" అన్నాడు అక్షాపు.

అనుకోకుండా అడగకుండానే తన కోరిక నెరవేరినందున పోతీఫెర మనసులో సంతోషిస్తూ, అక్షాపు వైపు తిరిగి "అయ్యా! ఐగుప్తు దేశమంతా కూడా యోసేపుగారి అధికారంలో ఉండగా, నా ఇల్లు, మా కుటుంబమంతా ఆయన సేవలోని వారమే కదా! అందుకు అనుమతి ఇవ్వటానికి మేమెంతటివారము. వారికి మా ఇల్లు స్థిరమైన విశ్రమస్థానంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ ఇంటి ప్రాంగణం సమీపించాడు.

ఓను యాజకుని గృహము చాలా విశాలమైన స్థలంలో, కోట మధ్యన కట్టబడి ఉంది. నైలునది యొక్క మొదటి పాయ చీలిన చోట నెల్లియోపోలిస్ అనే చోట ఓను దేవాలయం ఉంటే, దానికి ఆనుకొని ఎకరం విస్తీర్ణంగల ప్రహరీ లోపల ఉన్న ఈ ఇల్లు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. ఫరో యొద్ద నుండి అనేక వసతులు కల్పించబడినవి. ఓను యాజకుడు పోతీఫెర చాలా సాధువైనవాడు. ఆ ఇంటిలో అడుగుపెట్టిన వెంటనే దైవత్వం కనబడుతుంది. యాజకుని బలవంతము మీద లోపల ప్రవేశించి కూర్చున్నాడు అక్షాపు.

"ఆసెనతు ఎక్కడ ఉంది?" అడిగాడు పోతీఫెర.

ఆ మాటకు ఎవరూ జవాబు చెప్పలేదు. మరలా అడిగితే లోపల గదిలోకి చూపించి, తనతో రమ్మని సైగ చేసాడు. అక్షాపు నిదానంగా ఓను యాజకునితో లోపలికి వెళ్ళి చూస్తే, విశాలమైన గదిలో మంచం మీద నిశ్చలంగా పండుకొని నిద్రపోతున్న ఆసెనతు కనబడింది. అక్షాపు లోపలికి వచ్చి మంచం ప్రక్కన నిలబడి "ఆసెనతు..." అని పిలిచాడు. ఆసెనతు నిదానంగా కళ్ళు తెరచి చూసి నవ్వింది. చిన్నగా లేచి కూర్చోబోయింది. కాని అక్షాపు వారించి "సాయంకాలం యోసేపునకు ఓను యొద్ద పూజ జరుగుతుంది" అని చెప్పాడు.

యోసేపు అనే పేరు వినబడగానే ఆమె ముఖం వెలగటం అందరు గమనించారు. "యోసేపుకు ఒక సహాయం కావాలి. చేస్తావా?" అని అడిగాడు. పోతీఫెర, ఆయన భార్య కూడా ఆశ్చర్యపోయారు. మౌనంగా వింటున్నారు. ఆసెనతు చిరునవ్వు నవ్వుతూ, ఆలోచిస్తుంది. ఏమి సహాయం అయి ఉంటుంది అన్నట్లుగా.

"రెండు రోజులలో యోసేపుకు వివాహం జరగాలి. అవివాహితునికి రాజ్యము అప్పచెప్పారు. కనుక రెండు రోజులలో యోసేపుకు వివాహం జరిపించాలి" అన్నాడు.

ఆసెనతు కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"నీ సహాయం కావాలి" మరలా అడిగాడు అక్షాపు.

"నా సహాయం కావాలా ఏమిటి? క్రొత్తగా అంటున్నారే! ఆయనకి కావలసిన సహాయం ఆయన దేవుడే చేస్తాడు. ఆయన ఎవరి సహాయం తీసుకోరు. అన్నిటికి దేవుడే. ఎదురుగా మనుష్యులు ఉన్నా, దేవుడు అని అంటుంటారు" అంది కొంచెం నిష్టూరంగా, కొంచెం ఎగతాళిగా. కాని ఆమె మాటల లోతుల్లో దైవాభిమానం గోచరిస్తుంది. ఆమె కళ్ళలో ఏదో ఆశ కనబడుతుంది.

"యోసేపు పెండ్లి జరుగుతుందని మాట ఇస్తావా?" అన్నాడు బ్రతిమాలినట్లుగా.

అక్షాపు అంత బ్రతిమాలినట్లుగా అమ్మాయిని ఎందుకు అడుగుతున్నాడు? అక్షాపుకు మనకు తెలియని విషయాలు ఏవో తెలుసును అనుకున్నారు పోతీఫెర, అతని భార్య. ఆసెనతు కూడా ఎంతో కాలంగా దాచి ఉంచిన నిజం అబద్ధంగా మార్చటం ఇష్టంలేనట్లుగా కనబడుతుంది.

"ఆసెనతూ నువ్వు మాట ఇస్తే" అని ఆగి పోతీఫెర భార్య, పోతీఫెరవైపు మార్చి మార్చి చూసి, "ఆసెనతూ! యోసేపు వివాహం జరిగి అతను రాజ్యాధిపతి అవుతాడని మాట ఇవ్వు" అని చెయ్యి చాపాడు. ఆసెనతు ఇప్పుడు సిగ్గు పడింది. తల్లిదండ్రుల వైపు చూడలేక చూసింది, మీ సెలవు కావాలి అన్నట్లుగా. పోతీఫెరకి అర్ధమయ్యి, కానట్లుగా ఉంది.

ఆసెనతు సిగ్గుపడుతూ, తన చెయ్యి అక్షాపు చేతిలో వేసి ప్రమాణం చేసింది. విపరీతమైన సిగ్గు ముంచుకు రావటంతో తల అటు త్రిప్పుకున్నది. అక్షాపు వచ్చిన పని పూర్తయింది. సంతోషంగా లేచాడు. అవతలి గదిలోకి వెళ్ళి చెప్పులు వేసుకుంటుంటే, ఆసెనతు తల్లి అక్షాపు వద్దకు వచ్చి, "అమ్మాయి పిలుస్తుంది" అని చెప్పింది. ఇప్పుడు ఆసెనతు నిశ్చలంగా ఉంది.

"మీరు ఒక మాట ఇవ్వాలి" అని అడిగింది.

"ఏంటి?" అని అడిగాడు అక్షాపు.

"ఎల్లుండి... ఆయన..." అని ఆగి చిన్నగా "వివాహం జరిగే వరకు నన్ను చూడరావద్దని మీరు చెప్పండి. దయచేసి సాయంకాలం ఓను ఆలయానికి వచ్చినప్పుడు ఆయన ఇక్కడకు రాకుండా చూడండి" అంది బ్రతిమాలుతున్నట్లుగా.

"అదేమి?" అడిగాడు ఆశ్చర్యంగా అక్షాపు. ఆసెనతు ఏమి మాట్లాడలేదు.

"చెప్పు" అని మరలా అడిగాడు.

"దయచేసి ఈ సహాయం చెయ్యండి. ఆ తర్వాత నేను ఆయనదాననే కదా!" అని అంది. కళ్ళలో నీళ్ళు నిండి ఉన్నాయి. అక్షాపు నిదానంగా బయటకు నడిచాడు.

ఆసెనతు పెద్ద కష్టం లేకుండానే లేచి కూర్చొని తల్లిని పిలిచింది. ఆకలిగా ఉందని తల్లితో చెప్పింది. ఆసెనతు రెండేళ్ళ తర్వాత నిజంగా ఆకలిగొనింది ఈరోజే.

నది దాటి తను వదలి వచ్చిన రథం ఎక్కి యోసేపు దగ్గరకి వచ్చేటప్పటికి యోసేపును అలంకరించి ఉంచారు. అయినా తన అలంకరణ కాని, జరగబోయే ప్రధాన ఉత్సవం విషయం కాని అసలు మనసు పట్టలేదు. అక్షాపు కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాడు. అక్షాపు రాగానే లోపల గదిలోకి వెళ్ళారు. యోసేపు అంతా విని నిట్టూర్చాడు. సంతోషం, విచారం రెండూ కలసి ఉన్నాయి. ఏది విడదీయటానికి లేదు. ఈ రోజు ఆసెనతుని చూస్తానని ఎంతో ఆశపడ్డాడు. కాని ఆసెనతు అలా నిబంధన విధించటానికి ఏమి అవసరం వచ్చిందో అర్ధం కాలేదు. ఆసెనతు తల్లిదండ్రులు కూడా ఈ వివాహానికి ఒప్పుకోవటం దైవక్రియ. ఎందుకంటే ఐగుప్తీయులకు హెబ్రీయులు హేయులు.

**(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

32

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

మరునాడు మరలా సిక్లగు కళకళలాడింది. అయినా స్త్రీలు దుఃఖ ముఖాలతో ఉన్నారు. జరిగిన విషయం ఒక పీడకలలా ఉంది. పురుషులు లేని సమయంలో ఎన్నడూ ఊహించనైనా ఊహించని విధంగా అమాలేకీయుల దాడి వారిలో ఇంకా ధైర్యాన్ని పుంజుకోనివ్వడంలేదు. ఆ దాడిలో తమ పసిబిడ్డల ఏడ్పులు ఇంకా వారి చెవులలో మారుమ్రోగు తున్నాయి. ఈ సంఘటనవల్ల వారి గుండెలో రేగిన గాయం మానటానికి మరి కొంత సమయం పడుతుంది.

ఉదయం పది గంటలకు దావీదు కొంతమందిని పిలిచి అమాలేకీయులు యూదాలోను ఇతర పట్టణముల లోను దోచుకొని వెళ్ళిన గొఱ్ఱెలు, ఎద్దులు, గాడిదలను చెరిసగంగా విభజించమన్నాడు. అలా వచ్చిన సగభాగం తన వైపునకు మిగిలిన సగభాగమును తన అనుచరులను పంచిపెట్టమన్నాడు.

తరువాత యోవాబును పిలిచి మనం సౌలు చేత తరుమబడినప్పుడు సంచరించిన ప్రదేశాలలో గ్రామాలలోని పెద్దలకు పంపించటానికి నా వంతు వచ్చిన దోపుసొమ్ము లోని పశువులను పదమూడు భాగాలుగా చెయ్యమన్నాడు.

తొంభైఎనిమిదిమంది సహచరులను ఏర్పరచి "యెహోవా శత్రువుల యొద్ద నేను దోచుకొనిన సొమ్ములో కొంత ఆశీర్వాద సూచనగా మీకు ఇచ్చుచున్నాను అని చెప్పవలెను" అని వారికి చెప్పి బేతేలు, దక్షిణ రామోతు, యత్తీరు, అరోయేరు, షిప్మోతు, ఎష్టెమో, రాకాలు, యెరహ్మె యేలు, కేనీయ, హోర్మా, కోరాషా, అతాకు, హెబ్రోను పట్టణ ములకు ఒక్కొక్క గ్రామమునకు ఏడుగురు మనుష్యులకు వాటిని అప్పగించి పంపించాడు. తర్వాత తగులబడిపోయిన ఇండ్లను బాగుచేసికోవటంలో నిమగ్నమై పోయారు.

మూడవ దినమున దావీదు అతని ముఖ్య అనుచరులు ఒక చెట్టు క్రింద కూర్చునియున్నారు. ఇంకా ఎండ బాగా ముదరలేదు. వాళ్ళు మాట్లాడుకుంటుంటే బట్టలు చింపుకొని తలమీద బుగ్గి పోసికొనిన ఒకడు వచ్చి దావీదు కాళ్ళ యొద్ద నేలమీద సాగిలపడి నమస్కారం చేసాడు. వాని దగ్గర ఒక మూట వున్నది. "నీవెక్కడ నుండి వచ్చితివి?" అని అడిగాడు దావీదు.

"ఇశ్రాయేలు సైన్యంలో నుండి నేను తప్పించుకొని వచ్చితిని" అన్నాడు. అలా అని లేచి నిలుచుని చేతులు కట్టుకొన్నాడు.

"జరిగిన సంగతులేవో నాకు చెప్పు" అన్నాడు దావీదు ఆత్రంగా. ఈ లోపల అక్కడ వున్న దావీదు అనుచరులందరు వచ్చారు.

"జనులు యుద్ధమందు నిలువలేక పారిపోయిరి. అనేకులు పడి చచ్చిరి. సౌలును అతని కుమారుడైన యోనాతానును మరణమైరి" అన్నాడు ఏడుస్తున్నట్లుగా.

దావీదు తక్కున లేచి నిలబడి "సౌలును, అతని కుమారుడైన యోనాతానును మరణమైరని నీకెలా తెలి సింది" అన్నాడు దావీదు వణుకుతున్న గొంతుతో.

"గిల్బోవా పర్వతమునకు నేను అకస్మాత్తుగా వచ్చి నప్పుడు సౌలు తన యీటె మీద ఆనుకొనియున్నాడు. సౌలు కత్తి ఆయన రొమ్ములో దిగబడియున్నది. ఆయన వీపు మీద నాలుగు బాణాలు నాటియున్నవి. అతని ఆయుధాలు మోయువాడు సౌలు ప్రక్కనే కత్తి కడుపులో దిగియుండగా చచ్చిపడియున్నాడు.

దూరంగా ఫిలిష్తీయుల రథములును రౌతులును ఇటువైపే వస్తుండగా సౌలు నన్ను దగ్గరకు రమ్మని పిలిచాడు.

"చిత్తము నా యేలినవాడా" అని నేను దగ్గరగా వచ్చాను.

"నీవెవడవు?" అని నన్ను అడిగాడు.

"నేను అమాలేకీయుడను" అని బదులిచ్చాను.

"నా ప్రాణము ఇంక నాలో ఉన్నదిగాని తల త్రిప్పు చేత నేను బహు బాధపడుచున్నాను. నీవు నా దగ్గర నిలువబడి నన్ను చంపుము" అని అన్నాడు.

ఈలాగు పడిన తర్వాత అతడు బ్రతుకడని నేను నిశ్చయించుకొని అతని దగ్గర నిలిచి అతనిని చంపితిని. తరువాత అతని తలమీదనున్న కిరీటమును, హస్తకంకణము లను తీసుకొని నా యేలినవాడవైన నీ యొద్దకు వాటిని తెచ్చియున్నాను" అని ఆ మూట విప్పదీసి వాటిని పట్టుకొని నిలువబడినప్పుడు ఆశాహేలు వాటిని తీసుకొని దావీదు ప్రక్కన ఉంచాడు.

దుఃఖముతో దావీదు కళ్ళ వెంబడి నీరు కారుతుంటే రెండు చేతులు ఆకాశము పైకెత్తి వాటిని తన గుండెల మీద పెట్టుకొని తన వస్త్రములను బలంగా చీల్చినప్పుడు అవి రెండుగా చినిగిపోయినవి. అది చూసిన అక్కడి వారందరూ అదేవిధంగా తమ వస్త్రములను చింపుకున్నారు.

దావీదు అలానే నేలమీద కూర్చుండిపోయాడు.

ఆయన దగ్గరకి రావటానికి ఎవరూ ధైర్యం చేయలేదు. కొంచెంసేపు ఏడ్వటం కొంచెంసేపు ఆలోచించుకోవటం.

సాయంత్రమైనప్పుడు లేచి తన ఆసనం మీద కూర్చుని సౌలు వర్తమానం తెచ్చిన వానివైపు చూచి దగ్గరగా రమ్మని సైగచేసాడు.

"నీవెక్కడ నుండి వచ్చితివి?" అన్నాడు.

"నేను ఇశ్రాయేలు దేశమున నివసించు అమాలేకీయు డగు ఒకని కుమారుడను" అన్నాడు. అతని ముఖంలో ఇప్పుడు ఏదో ఆశ కనబడుతున్నది. దావీదు తన శ్రద్ధకు మెచ్చి ఏదైనా బహుమానం ఇస్తాడన్నట్లుగా ఉంది.

దావీదు ముఖం గంభీరంగా మారింది. కొంచెం కోపంగా ఉంది. ఏడ్చి ఏడ్చి కళ్ళు ఎర్రగా ఉన్నవి.

"భయపడక యెహోవా అభిషేకించిన వానిని చంపు టకు నీవేల అతని మీద చెయ్యి ఎత్తితివి? యెహోవా అభిషే కించిన వానిని నేను చంపితినని నీవు చెప్పితివే. నీ నోటి మాటయే నీ మీద సాక్ష్యము గనుక నీ ప్రాణమునకు నీవే ఉత్తరవాదివి" అని ఆశాహేలును పిలిచి...

"నీవు వానిని చంపుము" అని అరిచాడు.

వెంటనే ఆశాహేలు కత్తితో వాని గుండెలో పొడిచాడు. ప్రక్కనున్న వారు వాని శవమును దూరంగా తీసుకొని వెళ్ళారు.

దావీదు అలానే ఏడుస్తు కూర్చున్నాడు.

మరునాడు ఉదయం తన పడక మీద నుండి లేచిన దావీదు వీణ తీసుకొని యూదా శూరులకు లయబద్ధంగా ఉండు రాగం ఆలపించ ప్రారంభించి తర్వాత పాట పాడుతూ రోధించనారంభించాడు.

ఇశ్రాయేలూ నీకు భూషణమగు వారు నీ ఉన్నత స్థలమందు హతులైరి.

ఆహోహో బలాఢ్యులు పడిపోయిరి.

ఫిలిష్తీయుల కుమార్తెలు సంతోషింపకుండునట్లు

సున్నతిలేని వారి కుమార్తెలు జయమని చెప్పకుండు నట్లు

ఈ సమాచారము గాతులో తెలియజేయకుడి

అష్కెలోను వీధులలో ప్రకటన చేయకుడి.

గిల్బోవ పర్వతములారా! మీ మీద మంచైననూ

వర్షమైననూ ప్రథమ ఫలార్పణకు

తగిన పైరుగల చేలైనను లేకపోవునుగాక.

బలాఢ్యుల డాళ్ళు అవమానముగా పారవేయబడెను

తైలము చేత అభిషేకింపబడని వారిదైనట్టు

సౌలు డాలును పారవేయబడెను.

అబీషై ప్రక్కగా వచ్చి కూర్చున్నాడు. సౌలు విషయం ఏమి ఆలోచన రాలేదుగాని యోనాతానుతో అంత గొప్పగా హృదయమిచ్చి పుచ్చుకొన్నంత కాకపోయినా మంచి అను బంధమున్నది. ఇప్పుడు చనిపోయాడు అని మనస్సులో అనుకుంటే లోపల ఎక్కడో కలుక్కుమంటుంది.

అంతమంచి వాళ్ళు కూడా దుర్మార్గులతో సమంగా చనిపోవాలా? అని అనుకున్నాడు.

దావీదుకు మరికొంత దగ్గరగా జరిగి భుజం మీద చెయ్యి వేశాడు. దావీదు కళ్ళు ఎర్రగా ఉన్నాయి. **(సశేషం)**




# ‘ఐ లవ్ యూ సో మచ్ ‘




‘ఐ లవ్ యూ సో మచ్ రా నాన్న’ అని తల్లిదండ్రులు బిడ్డలతో అంటుంటారు. కదా! అలాగే బిడ్డలు కూడా తల్లి దండ్రులతో అంటారు. సరే, ఒకే రక్తం పంచుకొని పుడతారు కాబట్టి ఆ మాత్రం ప్రేమ ఉండటం సహజమే. ఎవరు ఎవరో తెలియకుండా అప్పటికప్పుడే వివాహబంధం ద్వారా ఒకటయ్యే భార్యాభర్తల మధ్య ‘ఐ లవ్ యూ సో మచ్ డార్లింగ్’ అనుకోనేంత ప్రేమ పొంగి పొర్లుతుంది. ఓకే, వాళ్ళు భార్యభర్తలు కాబట్టి జీవితాంతం కలిసి వుండాలి కాబట్టి, మనసులో ఉన్నా లేకపోయినా ఐ లవ్ యూ చెప్పుకొనే భార్యభర్తల మధ్యలో అలాంటి ప్రేమ ఉండటం కూడా సర్వ సాధారణం. ఇంక ముఖ్యమైన ప్రేమ ఒకటుంది. ఇలాంటి వాళ్ళ వల్లనే ప్రేమకు అనేకమైన నిర్వచనాలు, కవితలు పుడుతుంటాయి. వాళ్ళే మిస్టర్ అండ్ మిస్ యూత్. అబ్బో, అసలు ప్రేమ కోసమే పుట్టినట్లుగా ఉంటారు కొంతమంది. లైలా-మజ్ను, సలీమ్- అనార్కలీల వారసులే మన యూత్. వాళ్ళ ప్రేమకి పగ్గాలే ఉండవు. హత్యలు, ఆత్మహత్యలే వాళ్ళ ప్రేమకు నిదర్శనం. జనాలు కూడా వాళ్ళేరా నిజమైన ప్రేమికులు’ అనుకునేంత రేంజ్లో ఉంటది వాళ్ళ ప్రేమ. తల్లిదండ్రులు బిడ్డల మధ్య, భార్యాభర్తల మధ్య, యువతీ యువకుల మధ్య పుట్టే ప్రేమని ‘నిజమైన ప్రేమ’ అని ఎక్స్పోజ్ చేసుకోడానికి తెగ తాపత్రయపడతారు. వీళ్ళ మధ్య ఏ మాత్రం తేడా వచ్చినా ‘కన్నప్పుడు ఎవరికోసం ప్రేమిస్తారు?’ అని, ‘చేసుకున్నప్పుడు ప్రేమించక చస్తావా?’ అని, ‘వెంటపడి తిరిగినప్పుడు తెలీదా?’ అని ‘ఐ హేట్ యూ సో మచ్’ కి మారిపోతుంది వాళ్ళ ప్రేమ. అసలు ‘ప్రేమ’ అనేది తన స్వభావాన్ని మార్చుకోగలదా? ‘ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు; అమర్యాదగా నడువదు; స్వప్రయోజనమును విచారించుకొనదు; త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో ఉంచుకొనదు. దుర్నీతి విషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును. అన్నిటికి తాళు కొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును. ప్రేమ శాశ్వతకాలముండును’ (1కొరింథీ. 13:4-8). మనుష్యులు చెప్పుకొనే ‘ఐ లవ్ యూ సో మచ్’లో ప్రేమ యొక్క గుణాలైన ఇవన్నీ కనిపిస్తాయా? తల్లిదండ్రులైనా, కన్నబిడ్డలైనా, భార్యాభర్తలైనా, ప్రేమికులైనా సరే, వాళ్ళలో ఒకరు ఇంకొకరిని ప్రేమించకుండా తిరిగి ప్రేమించగలరా? ‘యస్, నేను ప్రేమిస్తాను’ అని ఎవరైనా ఆవేశంతో చెప్ప గలరేమో గానీ, ఆచరణలో అది సాధ్యం కాదు. సాధ్యమైతే తల్లిదండ్రులు బిడ్డల మధ్యలో ద్వేషం పుడుతుందా? భార్యా భర్తలు విడిపోగలరా? యువతీయువకుల మధ్యలో హత్యలు జరుగుతాయా? ఆత్మహత్య చేసుకోవాలని ఒకరిని ఒకరు పురికొల్పుకుంటారా? మనుష్యుల మధ్య ప్రేమ అది నిజమైన ప్రేమ కాదు. అది కేవలం ‘ఆకర్షణ’ మాత్రమే. దేవుని ప్రేమ మాత్రమే నిజమైనది. ‘దేవుడు ప్రేమా స్వరూపి’ (1యోహాను 4:8). ‘తమ ఆలోచనల ననుసరించి చెడుమార్గమున నడుచు కొనుచు లోబడనొల్లని ప్రజలవైపు దినమెల్ల నా చేతులు చాపుచున్నాను’ (యెషయా 65:2) అని ఎదురు చూచేటంత దేవుని ప్రేమ మనుష్యులలో ఉండదు. మిమ్మును ప్రేమించని వారిని కూడా మీరు ప్రేమించగలిగితే అది నిజమైన ప్రేమ. అప్పుడు చెప్పండి ‘ఐ లవ్ యూ సో మచ్’ అని.

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు
**9 4 4 0 2 1 7 7 2 6**

20

# మధ్యకాలము

తరువాత గెరాసలోని రగబం దుర్గము మీద దండెత్తాడు. అయితే అక్కడ మలేరియ జ్వర పీడితుడై క్రీ.పూ. 79లో మరణించాడు. అతని భార్య అయిన అలగ్జాండ్రా అతని సలహా మేరకు అతని శవమును ఆ కోట పట్టబడేంత వరకు అక్కడే దాచి ఉంచింది. తర్వాత యెరూషలేము తీసికొని వచ్చి అక్కడి పరిసయ్యులకు అప్పచెప్పి శవఖననము వారికిష్టమైన రీతిలో నెరవేర్చమని అడిగింది. తన భర్త, తన పిల్లలు మైనారిటీ తీరేంత వరకు తనని సంరక్షకురాలినిగా నియమించాడని, రాజ్యపాలన తన తండ్రి, సహోదరుడు అడ్డువచ్చి కొంతకాలం ఓపిక పట్టమన్నారు.

జూలియస్ సీజరు బ్రతికి ఉన్నంత కాలము యూదులు ఎంతో సుఖంగా జీవించారు. ఆయన పార్దియనులు రోమీయులకు చేసిన అన్యాయమునకు ప్రతీకారం తీర్చుకొన బయలుదేరు సమయంలో దుర్మార్గులు, కృతఙ్ఞతలేని వారైన బ్రూటస్, కాషియస్, మరికొందరు సెనెట్ సభ్యుల వలన హత్యగావించబడ్డాడు. ఇది క్రీ.పూ. 44 సెనెట్ ఇంట్లో జరిగింది.

వెంటనే కొషియస్ సిరియా మీదకు వచ్చి ఏడు వందల తులాల కంటే ఎక్కువైన వెండిని యూదుల యొద్ద దోచుకొని వెళ్ళాడు. మాలికస్ అను వాడు 'ఆంటీపీటర్' తర్వాత స్థానంలో రాజ్యములో ఉన్నాడు. అతని యొక్క కుళ్ళు స్వభావం దుర్మార్గత దేశంలో మరియొక అలజడి రేపింది. ఇతను ఎదోమీయుడైన యూదుడు. ప్రధానయాజకుని వంటవానికి లంచము ఇచ్చి ఆంటీపీటర్‌ని హత్యగావించి హెర్కనస్‌కి వారసుడు కావాలని కోరిక. హేరోదు కొషియస్ వద్దకు వెళ్ళి అతని సమ్మతిన మాల్కాస్‌ని తన తండ్రిని హత్య చేసినందుకు ప్రతీకారం చేయవలెనని తూరు పట్టణములోని రోవిరీయుల కోటలో అతని వధించాడు.

మాల్కాస్ యొక్క స్నేహితులు అప్పటి ప్రధాన యాజకుని ఫెలెక్స్ యొక్క కుమారుల మీద పగతీర్చుకొనవలెననుకొన్నారు. యెరూషలేము అంతా గొప్ప గందరగోళంలో ఉంది. హేరోదు దమస్కులో రోగియైయున్నాడు. అందువలన తిరుగుబాటు దారుల యొక్క కోపము, పగ ఫయిజుల్ ఒక్కడి మీద నిలచింది. అయినను ఫయిజుల్ మహాపరాక్రమంతో ఆ తిరుగుబాటు దారులను పట్టణము అవతలకి తరిమి వేశాడు. హేరోదునకు కొంచెం స్వస్థత కలుగగానే ఇద్దరు అన్నదమ్ములు కలిసి కుట్ర దారులను అణచివేశారు. సరిగా ఆ సమయములో హెర్కెనస్ తన కుమార్తెయైన మరియమ్నేమ హేరోదునకు ఇచ్చి వివాహం చేసి సంధి కుదర్చకపోయినట్లైతే అన్నదమ్ములు ఇద్దరు కలసి ప్రధాన యాజకునికి సరియైన విధంగా గుణపాఠము చెప్పి ఉండేవారు. అయితే ఇంతలో ఈ కుట్ర పూర్తిగా ముగియలేదు. బ్రూటస్ కేషియస్ యుద్ధములో ఓడిపోయిన తర్వాత రోమా సామ్రాజ్యాధి నేతలలో ఒకరైన ఆంటనీ యొద్దకు యూదులలో కొందరు ఘనత వహించిన వారు వెళ్ళి అన్నదమ్ములిద్దరూ నేటి రోమా ప్రభుత్వమునకు వ్యతిరేకులని వారిని యూదయ నుండి తొలగించమని చెప్పారు. అయితే ఆంటనీ వారి మాటలు విశ్వసించకపోగా యూదయ అంతటికి పరిపాలనా బాధ్యత వారికి అప్పగించి, యూదులందరు ఈ కట్టడికి లోబడి ఉండవలెనని వచ్చిన వారిలో పదిహేనుమందిని ఇందుకు బాధ్యులుగా బంధించి తర్వాత హేరోదు కాని ఆంటనీని అభ్యర్థించక పోయినట్లైతే వారందరిని చంపియుండే వాడు.

తర్వాత ఆంటనీ తూరు పట్టణము వచ్చినప్పుడు వెయ్యి మంది యూదా పెద్దలు ఆంటనీ యొద్దకు ఇదే విధమైన నేరారోపణలో సందర్శించారు. అయితే ఆంటనీ ఇది యూదుల తిరుగుబాటుకు నాంధిగా భావించి తన సైనికులతో వారిని చంపనాఙ్ఞాపించాడు. కొందరు మరణించారు, మరికొందరు గాయపడ్డారు. హేరోదు యెరూషలేము వచ్చినప్పుడు తిరుగుబాటు దారులు అతని పరివారము మీద ఇదే విధంగా ప్రవర్తించారు. ఈ సంగతి తెలిసిన ఆంటనీ తన స్వాధీనంలో ఉన్న పదిహేను మందిని చంపించి ఇదే విధంగా మిగిలిన కుట్రదారులకు కూడా జరుగుతుందని ప్రకటించాడు.

**(సశేషం)**

# నీ సృష్టికర్త

మానవ శరీరం కణాల సముదాయమని, కణ కేంద్రకం లో ఇమడి ఉన్న డి.యన్.ఎలో నిక్షిప్తమైయున్న కోడ్‌కి అనుగుణంగా కణవిచ్ఛిత్తితోపాటు కణజాల అభివృద్ధి జరుగుతుందని మనం గత సంచికలో తెలుసుకున్నాం. ఈ సంచికలో కణజాలం గురించి తెలుసుకుందాం.

నిరంతర కణవిచ్ఛిత్తి ద్వారా ఏర్పడిన కణాలు సముదాయంగా ఏర్పడతాయి. కణసముదాయలు ఒక దానితో ఒకటి అతుకబడినట్లుగా ఉండి వాటి చుట్టూ ఒక వలయాన్ని ఏర్పరచుకుంటాయి వీటిని కణజాలం అంటాం

కణజాలలు రకరకాల ఆకారాలలో, రకరకాల పరిమాణాలలో శరీరంలో ఏర్పడతాయి. ఈ కణజాలల సముదాయాన్ని కండరం అంటాము.

కండరాలువాటి వాటి ఆకార పరిమాణాలతో పాటు అవి నిర్వర్తించే విధులను బట్టి ఆ కండరాలకు పేరు పెట్టబడుతుంది. అన్ని కండరాల యొక్క ప్రాథమిక విధి ఏమంటే "కదలిక" ను కలిగించుట.

కండరాలు అన్ని కూడా సంకోచ గుణాన్ని కలిగి జతలుగా పనిచేయడం ద్వారా కదలికలు సాధ్యపడతాయి.

ఈ కండరాలు చర్మం క్రిందగా ఉండి మరో చివర కండర బంధనంగా మారి ఎముకలతో అనుసంధానమై ఉంటాయి

ఈ కండరాలు శరీరంలోని అన్ని ఎముకలను కప్పుతూ ఏర్పడి, ఎముకల జాయింట్స్ ద్వారా కదలికలను ఏర్పరచడానికి తోడ్పడతాయి. ఉదా: నడవడం, పరిగెత్తడం చేతులు పైకెత్తడం, రకరకాల పనులు చేయడం వంటివి.

అయితే ఈ కదలికల్లో కొన్ని మన నియంత్రణలో ఉండగా, కొన్ని అనియంత్రిత కదలికలను కలిగిన కండరాలు ఉంటాయి. వీటిని అసంకల్పిత కదలికలు అంటారు ఉదా: హృదయకండరాలు నిరంతరం కదలికను కలిగి ఉంటాయి. ఆ కదలికలను మనం గుర్తించలేము , నియంత్రించలేము.

కండరాలను మూడు రకాలుగా విభజించవచ్చు.

1. స్కెలిటల్ మజిల్స్ (అస్థికండరాలు) అంటే ఎముకలపై/ ఎముకలతో అనుసంధానమై ఉండే కండరాలు. ఉదా : కాళ్ళు చేతులు. మానవ శరీరంలో మొత్తం 640 అస్థి కండరాలు ఉంటాయి.

2. సాఫ్ట్ మజిల్స్ (నునుపు కండరాలు) అంటే మెత్తని మృదువైన కణజాల సముదాయం ఉదా: జీర్ణాశయం, ప్రేగులు, ఊపిరితిత్తులు, రక్తనాళాలు. సాఫ్ట్ మజిల్స్‌ను లెక్కించడం అసాధ్యం. ఇవి పొరలు పొరలుగా , వలయాలుగా, చుట్టలుగా ఉంటాయి.

3. కార్డియాక్ మజిల్స్(అనియంత్రిత కండరాలు) అనగా హృదయ సంబంధిత కండరాలు. ఇది కేవలం హృదయంలో మాత్రమే ఉంటుంది.

శరీర బరువులో 2/5 శాతం కండరాల బరువే ఉంటుంది.

మొత్తం శరీరానికి అందే శక్తిలో 20శాతం శక్తిని ఈ కండరాలు ఉపయోగించుకుంటాయి.

దవడ ఎముకన అతుకబడే ఉండే కండరం మానవ శరీరంలో అతి బలమైన కండరం.

మనం నవ్వినప్పుడు 17 ముఖకండరాలు పనిచేస్తాయి మనం విచారంగా కోపంగా ఉన్నప్పుడు దాదాపు 40 కండరాలు పనిచేస్తాయి.

ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో అంతుచిక్కని ఊహకందని అద్భుతాలను మన శరీరంలో కనుగొనవచ్చు

"చర్మముతోను మాంసముతోను నీవు నన్ను కప్పితివి ఎముకలతోను నరములతోను నన్ను సంధించితివి" యోబు 10:11

ఇంత అద్భుతమైన శరీరమును దేవుని ద్వారా ఉచితంగా పొందిన మనం దేవుని పట్ల, ఆయన సృష్టియైన తోటి మానవుల పట్ల ఎటువటి వైఖరి కలిగి ఉన్నాము? అది నిన్ను నన్ను నిర్మించిన సృష్టికర్తకు ఆమోదయోగ్యమైనదా? కాదా? అని అనునిత్యం మన ప్రవర్తన సరిచేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సాక్ష్యము

# శ్రీమతి ఎ. రత్నకుమారి

ఒకామె స్వస్థత ప్రార్థన కోసం నా దగ్గరకువచ్చింది. ఆమె చెయ్యి పడిపోయింది. నేను ఆమె కొరకు ప్రార్థన చేసినప్పుడు ఆమె ఆ చేతితో పని చేసుకోవడం ప్రారంభించింది. యేసుప్రభువు ఆమెకు స్వస్థత అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రము. ఆమె 17 సం॥ల కుమారుడు శేఖరుకు యేసుప్రభువు అంటే గిట్టదు. ఎప్పుడూ తల్లిని దూషిస్తూ వుండేవాడని ఆమె చెప్పి శేఖరును ప్రార్థనకు పంపించింది. మాఇంట్లో ప్రతిరోజూ స్త్రీల కూడిక జరుగుతుంది. ఈ బాబు కూడా వచ్చేవాడు. ప్రభువుని అంగీకరించి క్రీస్తు కొరకు బండగా తయారయ్యాడు. వారి కులదైవం పండుగ వచ్చింది. ఆ పండుగకు శేఖర్ హాజరుకాలేదు. వాళ్ళమ్మ మాత్రం పూజలు చేసింది. బంధువులు శేఖర్‌ని నిందించారు. కాని శేఖర్ లొంగలేదు. క్రీస్తే నా దేవుడు అని జవాబిచ్చాడు. మరుసటి రోజు దీనంతటికీ కారణం ఆ రత్నకుమారి మేడం, ఆమెను ఈ ఊరులోఉండనీయ కూడదు, ఉంటే ఊరోళ్ళందరూ మతం మార్చుకుంటారు అని మా ఇంటి మీదకు వచ్చి ఎన్నో విధాలుగా దూషించారు. మమ్మల్ని చంపుతామని బెదిరించారు. నా ఉద్యోగం తీసేయాలంటూ పై అధికారులకి అర్జీలు పెట్టారు. నా మీద ఎన్నో నిందలు వేసి మాట్లాడారు. పోలీస్ రిపోర్టు ఇవ్వాలనుకున్నాను కాని ప్రభువు దర్శనం ప్రకారం వెళ్ళలేదు. మత ప్రచారం చేస్తున్నానని నా గురించి వార్తాపత్రికలలో వ్రాశారు.

ఆ గ్రామ ఉపసర్పంచ్ మా ఇంటికి వచ్చి ఇల్లు ఖాళీ చేయాలని, లేకుంటే ఇల్లు తగుల బెడ్తామని ఇంటి ఓనర్స్‌ని బెదిరించారు. చాలా అసహ్యమైన మాటలు మాట్లాడారు. నాకు ఏం చెయ్యాలో అర్థంకాక మౌనంగా ప్రభువు వైపు చూస్తున్నాను. మరుసటి రోజు దేవుని సన్నిధిలో 'సేవ మానేస్తాను, సేవ చెయ్యలేను' అని కన్నీటితో ప్రార్థిస్తున్నాను. నిలువెత్తు సిలువలో యేసయ్య రక్తము, నీరు అంతా కారిపోయి ఎండిపోయిన మాంసంలా కనిపించి నావైపు చూస్తున్నాడు. ఆ చూపులు నా గుండెను పగులగొట్టేలా వున్నాయి. నేను సేవకు వెళ్ళను అనుకొని నప్పుడు ఆ చూపే పదే పదే జ్ఞాపకం వస్తుంది. 'ప్రభువా నీ కొరకు చనిపోవడానికి సిద్ధంగా వున్నాను' అన్నాను నేను. యెషయా 40వ అధ్యాయంతో నాతో మాట్లాడాడు. భయపడక ధైర్యంగా సువార్త ప్రకటించు నీ జీతం నా దగ్గర వుంది అని పలికిన మాటలు నన్ను ధైర్యపరిచాయి. ఒక్కొక్క వచనం నా కొరకే అన్నట్లు అనిపించింది. నాకు చాలా ధైర్యం వచ్చింది. ఖచ్చితంగా నాలుగు గంటలు గడవక ముందే ఆ ఉపసర్పంచ్‌కి యాక్సిడెంట్ జరిగి, ఐదు లక్షల నష్టం వచ్చింది. ఇది జరుగుట ద్వారా ఆ వీధిలోని వాళ్ళు యేసుప్రభువుని మతపరంగా కాకుండా ఆయనని నమ్మిన వాళ్ళ పక్షంగా వున్న గొప్ప దేవుడు అని భయపడ్డారు.

ఒక ఆదివారం పిల్లలకి సండేస్కూల్ చెప్పి వచ్చి పడుకున్నాను. ఇద్దరు స్త్రీలు తెల్ల చీరలు కట్టుకొని పిల్లల మధ్య కూర్చోని ఏమో చెప్పి, నా దగ్గరకు వచ్చి "అమ్మ మీ సంఘం నిమిత్తం కూడ దేవుని దగ్గర కానుక చెల్లించాము" అన్నారు. నేను కళ్ళు తెరచి "ఇది సంఘమా దేవా! నీకు స్తోత్రం నాయనా!" అనుకున్నాను. అప్పటి నుండి పిల్లలు 70, 80 మందిదాక వస్తున్నారు. అప్పుడు ఎండాకాలం పిల్లలకు బడి సెలవులు. రోజు ప్రొద్దున నుండి సాయంత్రం దాకా ఉండేవాళ్ళు. ఇదంతా చూసి సంఘకాపరి ఒక స్త్రీని నియమించి, సండేస్కూల్‌కి ఎవరు వస్తారో వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి వారి తల్లిదండ్రులతో- పిల్లలకు చాక్లెట్లు, గిఫ్ట్‌లు ఇస్తూ పిల్లల్ని అమ్ముకొని అమెరికా నుండి ఈ గిఫ్ట్‌లు తెప్పిస్తుంది. మీ పిల్లల్ని పంపవద్దు అని చెప్పించారు. తరువాత ఆదివారం నుండి 25 మంది పిల్లలే వస్తున్నారు. నాకు ఆశ్చర్య మేసింది. అసలు విషయం పిల్లల ద్వారా తెలుసుకొన్నాను. ఆ మేడమ్ ఎక్కడ నుండి వచ్చిందో మనకు తెలియదు. ఆమె మంచిది కాదు అని చెప్పించారని పిల్లలు నాతో చెప్పినప్పుడు కృంగిపోయాను. అయినా నా ధ్యేయం ఒక్కటే ప్రభువు పంపాడు, ప్రభువే నన్ను నడిపిస్తాడు. ఆయన నా తండ్రి. ఆయన పని నేను బాధ్యతగా చేస్తాను అని నిర్ణయించుకున్నాను.

ఒక ఆదివారం సండేస్కూల్ నడిపిస్తున్నాను. ఒక కారువచ్చి ఆగింది. అందులో నుండి ఒక వ్యక్తి వీడియో కెమెరా పట్టుకొని మమ్ములను తీస్తున్నాడు. నేను భయ పడలేదు. మేము టి.వి.9 వాళ్ళము అని పిల్లలను కొన్ని ప్రశ్నలు అడిగారు. పిల్లలు ఉన్నమాటే చెప్పారు. "మిమ్మల్ని తెల్లడ్రస్సు వేసుకోమని, కాషాయము రంగు వేసుకోవద్దని, బొట్టు పెట్టుకోవద్దని మేడమ్ చెప్తారా?" అని కొన్ని ప్రశ్నలు అడిగారు. పిల్లలు "మేడమ్ మాకు అలాంటివి ఎప్పుడూ చెప్పలేదు. యేసయ్య దేవుడు అని చెప్పేది" అని అన్నారు. పాస్టరు వాళ్ళ పిల్లల్ని పోగుచేసి మేడమ్ కాషాయము రంగు బట్టలు వేసుకోవద్దన్నది అని చెప్పించి చాలా గొడవ చేశారు. శేఖర్ వాళ్ళ అమ్మ – మా అబ్బాయి మా మాట వినటంలేదు. వీళ్ళు మంత్ర గాళ్ళు, బైబిల్‌కి ఏ మంత్రం చేసి ఇచ్చారో ఎప్పుడు బైబిల్ చదువుతాడు ఏమైనా అనడం ఆలస్యం ఇంట్లో నుండి వెళ్ళి పోతాను అంటున్నాడు అన్నది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామనుకున్నాను కాని నేను ఎవని మీద ఆనుకున్నానో ఆయన సర్వశక్తిమంతుడు. ఒక బిడ్డను కనడానికి ప్రసవవేదన తప్పదు పైగా, పోలీస్‌స్టేషన్‌కి వెళ్తే మా మీదికి వచ్చిన వాళ్ళు యేసును చూడలేరు. మేము మా సిలువను ఎత్తుకొని వాళ్ళ మధ్యకు వెళ్ళాము.

ఆర్.యస్.యస్. లీడరు అక్కడకొచ్చాడు, ఎన్నో మాటల న్నాడు. శేఖర్‌ని బయటకు పిలిచి ఇప్పుడన్నా ఆ మతాన్ని విడుస్తావా! లేదా! అన్నారు. శేఖర్ బ్రతికితే యేసయ్య కొరకే బ్రతుకుతాను. చనిపోయిన యేసయ్య కొరకే చని పోతాను అన్నాడు. ఆ క్షణం నాకు భయం, సంతోషం, ఆశ్చర్యం కలిగాయి. క్రీస్తులో ఒక బలమైన విశ్వాసిని కన్నందుకు నేను గర్వించాను. దేవునికి స్తోత్రం!

ఈ సమస్యలతో నా హృదయం బ్రద్దలైనది. ఎందుకు ఈ సమస్యలు అని ఏడ్చుకుంటూ ప్రార్థిం చాను. యెషయా 40:9 ఒక మనిషి మనిషితో సూటిగా మాట్లాడినట్లు అనిపించింది. "సీయోనూ, సువార్త ప్రక టించుచున్నదానా, ఉన్నత పర్వత మెక్కుము. యెరూషలేము సువార్త ప్రకటించుచున్నదానా? బలముగా ప్రకటించుము. భయపడక ప్రకటించుము ఇదిగో నీ దేవుడు అని యూదా పట్టణమునకు ప్రకటించుము" అని ప్రభువు నాతో మాట్లాడాడు. ఆ మాటలు కూలిపోయిన నన్ను నిలబెట్టి, వెన్నుతట్టి బలపరచినవి.

ఉదయాన్నే నిద్రలేచి ఆరు గంటల దాక ప్రార్థనలో ఉండి, ఇంట్లో పనిచేసుకొని స్కూలుకి వెళ్ళాను. సాయంత్రం ప్రార్థనకు వచ్చిన వాళ్ళు అన్నారు అమ్మా! ప్రొద్దున ఆరు ఏడు గంటల ప్రాంతంలో ఉపసర్పంచ్ గారికి యాక్సిడెంటు అయ్యింది. ఆయన ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. హైదరాబాదుకు వెళ్ళి వస్తుండగా కారు చెట్టుకు గుద్దుకొని ముందున్న ఛాతిలో ఎముకలన్నీ చిట్లినవి, డాక్టర్లు బ్రతకడు అని అంటున్నారని చెప్పారు. ఆయన కోసం మేమందరము ప్రార్థించాము. ఆయన భార్య, బంధువులు నువ్వు ఆ మేడమ్ వాళ్ళ జోలికి ఎందుకు పోయావు? ఎవరి దేవుడు వాళ్ళకు గొప్ప. వాళ్ళ దేవుడు చాలా గొప్పవాడు అని అన్నారంట.

ఇంక మాకు ఇల్లు అద్దెకిచ్చిన వాళ్ళు ఇల్లు ఖాళీ చేయండి అని రోజు చెప్పేవాళ్ళు. సరే ఇల్లు వెతకడానికి వెళ్తే ఈ అల్లర్ల కారణంగా ఎవరూ ఇల్లు అద్దెకు ఇచ్చే వాళ్ళు కాదు. ప్రభువా! నాకు ఉండటానికి ఇల్లు లేదు. నీ చిత్తం ఏమిటి అని ప్రార్థించాను. ముందు సముద్రం, వెనుక శత్రుసైన్యంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఇశ్రాయేలీయులను నడిపించిన రీతిని నా కన్నీరు తుడిచి ఆశ్చర్యకరమైన రీతిలో ఆ వీధిలోనే, రెండు లక్షలతో స్థలం ఏర్పాటు చేశాడు. నేను అనుకునేదాన్ని ఈ ధనవంతుల మధ్య నేను స్థలం కొనలేను. నన్ను ఈ ధనవంతుల మధ్యకు ఎందుకు తెచ్చావు? అని దిగులు పడేదాన్ని. గవర్నమెంటు భూమిలో రెండు గదులతో రేకులు వేసుకుందాము అనుకున్నాను. ఎన్నో ప్రయత్నాలు చేశాను ఎందుకంటే నా చేతిలో డబ్బులేదు. స్థలం కొనే శక్తి నాకు లేదు. ఒక సం॥లో నా జీతంలో డబ్బు మిగిల్చి బ్యాంకులో ఉంచాను. అవి 23 వేలు ఉన్నాయి. దానితో స్థలం రాదు. మా వీధి చివరలో ఒక స్థలం ఉంది. ధైర్యం చేసి, ఆ స్థలం యజమానిని కలిసి నీ స్థలం కొంటాము అని అడిగాము. వాళ్ళు అమ్ముతారన్న నమ్మకం మాకు లేదు. కాని ఈ స్థలం అంతా ప్రభువు నాకు దర్శనంలో చూపించి

ఇక్కడే ఉండమని అన్నాడు కదా! ప్రభువు చిత్తమైతే ఈ స్థలం నాకు యేసయ్య ఇస్తాడు అనుకొని అడిగాము. ఆయన ఒప్పుకున్నాడు. ఆ స్థలం 1,75,000 చెప్పాడు. మా దగ్గర అంత డబ్బు లేదు. ఆ యజమానికి 10,000 అడ్వాన్స్ ఇచ్చి మీకే అమ్ముతాను ఈ స్థలం ఎవ్వరికి ఇవ్వను అని రాయించు కున్నాము. ఈ విషయం తెలిసి కొంతమంది మాకు అమ్మవద్దని ఆయనకు చెప్పారు. కాని ప్రభువు తలుపు తీయగా వేసే శక్తి ఎవ్వరికి లేదు. మరి అంత డబ్బు ఎలా అని ఆలోచిస్తుండగా, బ్యాంక్‌వాళ్ళు పర్సనల్ లోన్ ఇస్తున్నారని తెలిసింది. బ్యాంక్‌కి వెళ్ళి అన్ని విషయాలు తెలుసుకున్నాను. వాళ్ళు గ్యారెంటర్ కావాలి అన్నారు. మా స్కూల్‌లో అందర్ని అడిగాను. ఎవ్వరూ నాకు గ్యారెంటర్‌గా ఉండటానికి ఇష్టపడలేదు. ఎందుకంటే ఈ అల్లరి జనం కలెక్టర్‌దాక నా గురించి ఉత్తరాలు పెట్టారు. మతప్రచారం చేస్తున్నానని న్యూస్ పేపర్‌లో వేయించారు. అందువల్ల అందరూ ఈమెకు గ్యారెంటర్‌గా ఉంటే ఎలా? ఈమె ఉద్యోగం ఉంటుందో? ఉండదో అని ఎవ్వరు ముందుకు రాలేదు.

ఎవ్వరు చేయి విడచినా, యేసు నా చెయ్యి విడువలేదు. మనుష్యుల సహాయం వ్యర్థం. ఈ పరిస్థితుల్లో పేతురు యేసయ్య ముఖం చూస్తూ నీళ్ళ మీద నడచిన సన్నివేశంను నేను జ్ఞాపకం చేసుకుంటూ, నా పరిస్థితులను అధిగమించి ముందుకు సాగుతున్నాను. ప్రభువు నా వెన్నుతట్టి నీ పనులు నువ్వు చేసుకో, గ్యారెంటర్‌ను నేను పంపుతాను అని ధైర్యపరిచాడు. లోన్ కోసం నేను పేపర్ వర్క్ చేసుకుంటుంటే మా స్కూల్‌లో కొలీగ్స్ నీకు ఎవరు గ్యారెంటర్? అని అడిగారు. నేను యేసుప్రభువు అని చెప్పాను. యేసుప్రభువు బ్యాంక్‌కి వచ్చి సంతకం చేస్తాడా అని అడిగారు. అవును అన్నీ ఆయనే చేస్తాడు అన్నాను. వాళ్ళు ఎగతాళిగా నన్ను చూస్తున్నారు. అసలు గ్యారెంటర్‌ని ఎవర్ని పంపిస్తున్నాడో తెలియదు. కాని చాలా ధైర్యంగా ఉంది, చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ముందుకు ప్రభువు ఎలా ద్వారాలు తెరుస్తాడో చూడాలని ఉంది. గ్యారెంటర్ కోసం ఎదురు చూస్తు న్నాను. ఒక హాస్టల్ వార్డన్ మా స్కూల్‌కి వచ్చాడు. నాకు ఆయనతో పరిచయం లేదు. ప్రతి ఒక్కరినీ అడిగినట్లు ఆ వ్యక్తిని కూడ గ్యారెంటర్‌గా సంతకం చేస్తారా అని అడిగాను. ఆయన వెంటనే అది ఎంత పని మేడమ్ నేను తప్పక చేస్తాను అన్నారు. రేపు నేను బ్యాంకుకు వెళు తున్నాను సార్! మీరు వచ్చినట్లయితే నాకు సహాయం చెయ్యవచ్చు అన్నాను. ఆయన ఒప్పుకున్నారు. కాని నాకు నమ్మబుద్ధి కాలేదు. ఏదో మొహమాటానికి అన్నారు అనుకున్నాను.

ఆ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్‌గారు దగ్గరకు వెళ్ళాను. మీ గ్యారెంటర్‌ను తెచ్చారా అని అడిగారు. వస్తానన్నారు సార్! అంటుండగానే ఆ వ్యక్తి వచ్చారు. ఫీల్డ్ ఆఫీసర్‌తో మాట్లాడి ఎక్కడెక్కడ సంతకాలు పెట్టాలి సార్! అని అడిగి, సంతకాలు చేసి ఆయన ఫోటో, సేలరీ సర్టిఫికెట్ ఇచ్చి ఆయనకు మీటింగ్ ఉందని వెళ్ళిపోయారు. నేను ఫీల్డ్ ఆఫీసర్‌గారి దగ్గర సంతకాలు పెడుతున్నప్పుడు ఆయన– అమ్మా, మీరు క్రైస్తవులా అని అడిగారు. అవును నేను సేవకురాలను కూడా అన్నాను. అమ్మా, నేను ఈ రోజు సెలవు పెడదామని సెలవు చీటి కూడ రాశాను. మిమ్మల్ని చూసినప్పుడు, నువ్వు ఈమె పని అయిపోయిం దాక ఎక్కడికి వెళ్ళవద్దని యేసయ్య అన్నారు. నేనూ ఒక పాస్టర్‌నే! అని ఆయన సాక్ష్యాన్ని చెబుతూ, 75,000 నా అకౌంట్లో నాలుగు గంటలకు వచ్చేట్టు చేశారు. మరుసటి రోజు నేను బ్యాంక్ బుక్ తీసుకొని స్కూల్‌కి వెళ్ళాను. అందరికి నా అకౌంట్లో లోన్ డబ్బు చూపించాను. ఎలా సాధ్యం? లోన్ పెట్టుకున్న వారందాక డబ్బు అకౌంటులో పడదన్నారు. యేసయ్య కార్యాలు ఆశ్చర్యాలు అన్నాను. వాళ్ళు సిగ్గుతో తల దించుకున్నారు. ఇంత గొప్ప మేలు చేసిన యేసయ్యకు మహిమ కలుగును గాక! దేవుడు ద్వారము తెరువగా మూసే శక్తి ఎవ్వరికి లేదు. ఈ సంఘటన నా జీవితంలో నేను ప్రభువు కొరకు పడిన అవమానములు, అపనిందల నుండి కొంత ఉపశమనం కలిగించినది. పడగొట్టుటయు, నిలబెట్టుటయు ఆయన చిత్తము.

ఇల్లు కట్టడానికి ముగ్గురు మేస్త్రీలు మారారు. మేస్త్రీలు ఇల్లు కట్టడానికి ముందుకు రాలేదు. ఈ మేడమ్ దగ్గర డబ్బులేదు. బ్యాంక్ వాళ్ళు ఇవ్వకపోతే మాకు ఇవ్వలేదు అనే ఉద్దేశ్యముతో పునాది ఒకళ్ళు, ఇటుక పని ఒకళ్ళు,

ప్లాస్టరింగ్ పనికి ఒకళ్ళు కుదిరారు. అసలు ఇల్లు కట్టబడటం షద్రకు, మేషాకు, అబేద్నెగోలు అగ్నిగుండంలో ఉన్నప్పుడు వీళ్ళు ఎలా కాలిపోలేదు అని అందరూ ఆశ్చర్యపడినట్లుగా జరిగింది. నన్ను చూస్తున్న వాళ్ళు ఈమె ఇల్లు కట్టలేదు ఆగిపోతుంది అని మేస్త్రీలను భయపెట్టారు. నేను అలా ఈ సమస్యలో నశించిపోతానని అనుకున్నారు.ఊరంతా ఎగతాళి చెయ్యడానికి నా వైపు చూస్తున్నారు. కాని ఆశ్చర్యరీతిలో పూర్తి అయ్యింది. డబ్బు రేపు కావాలి?ఎలా! అనుకునేంతలో అవసరమైనవి అడిగి మరీ ఇచ్చారు. దేవునికి స్తోత్రం.

ఫ్లోరింగ్ దగ్గరకు వచ్చేసరికి ఎటూ తోచలేదు. ఏమి చెయ్యాలి? డబ్బు లేదు. అన్ని పనులైనట్లు ఇది కూడ ప్రభువే చేస్తాడు అనుకున్నాను. సిమెంట్ ఫ్లోరింగ్ చేయిస్తాను అని అనుకున్నాను. ఒకామె నా దగ్గరకు వచ్చి ఇల్లు చూసి అమ్మా, నీకు ఒక లక్ష ఇస్తాను మార్బుల్ వేయించు అన్నది. నేను అంత డబ్బు వద్దు యాభైవేలు ఇవ్వమని అడిగాను. తెచ్చి ఇచ్చింది. మార్బుల్ షాప్‌కి వెళ్ళి అన్నిటికంటే తక్కువది సెలక్ట్ చేశాము. అడుగు 35రూ. దాన్ని పాలిష్ పెట్టిన తరువాత చూసి అందరూ ఆశ్చర్య పోయారు. ఒక అడుగుకి దీని ధర 50 రూపాయలైనా ఉంటదన్నారు.

అనేకమంది ఆత్మీయంగా నడిపించబడుటకును, అనారోగ్యంతో బాధపడుచున్నవారును ప్రార్థనకు వస్తారు. అందులో గంగారెడ్డి, సుమ అనే దంపతులకు ఇద్దరు సంతానం. ముందు ఆడపిల్ల. మాటలు రావు. శారీరకంగా బలహీనురాలు. తరువాత మగపిల్లవాడు పుట్టాడు. పుట్టగానే బలహీనంగా జన్మించాడు. ఒకటిన్నర సంవత్సరం వచ్చినా 3 నెలల బాబులా ఉన్నాడు. కళ్ళు నిలుపలేదు. పళ్ళు రాలేదు. ముసలి చర్మంలానే ఉండేది. ఒకరోజు పిల్లల్ని తీసుకొని మనోదుఃఖంతో తల్లి విలవిలలాడుతూ వచ్చింది. ఆ బాబును చూస్తే ఎవరైనా బ్రతకడు అనేలా ఉన్నాడు. మేము ఆ బాబును ఎత్తుకొని ప్రార్థన చేశాము. ప్రతిరోజు తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకొని ప్రార్థనకు వచ్చేవారు. యేసయ్య వాళ్ళపట్ల కనికరపడి ఆ పిల్లల్ని స్వస్థపరిచారు. తల్లిదండ్రులు బలమైన విశ్వాసులుగా ఎదిగారు. వాళ్ళు ఒకప్పుడు భయంకరమైన పూజలు, మాంత్రికశక్తులను ఆశ్రయించిన వారు. వాటన్నిటిని విడిచి క్రీస్తును స్వరక్షకుడిగా అంగీకరించి బాప్తిస్మం తీసుకున్నారు. వారు పొలంలో పని చేయడానికి వెళ్ళి అక్కడ సువార్త ప్రకటిస్తూ గంగారెడ్డి అనేక ఆత్మలను సంపాదిస్తున్నాడు. మా సంఘానికి చాలా మేలుకరంగా ఉన్నారు. ఒకప్పుడు క్రీస్తును ద్వేషించిన వాళ్ళ అమ్మ సుశీల, తండ్రి నాగన్నలు కూడా యేసును తెలుసుకుని ప్రతి ఆదివారం చర్చికి వస్తారు. వాళ్ళ ఇంట్లో అద్దెకు ఉంటున్న రెండు కుటుంబాల వారిని క్రీస్తులో నడిపిస్తున్నారు.

కసాయి రాజవ్వ అనే స్త్రీ ఎంతో దురాత్మ చేత బాధపడుచుండేది. నాగుపాము ఆమెకు మాత్రమే కనిపిస్తూ భయపెట్టేది. ఆమెను దురాత్మ బాధించక ముందు ఎప్పుడు బలహీనతతో బాధపడుచుండేది. ఒకసారి ప్రార్థనకు రామ్మా! అని చెప్పాను. కానీ ఆమె నిర్లక్ష్యం చేసింది. దురాత్మ బాధించగా అనేక నిద్రలేని రాత్రులతో బాధపడుచున్నప్పుడు నేను జ్ఞాపకం వచ్చాను. వాక్యం చెప్పి బలపరచగా యేసయ్య స్వస్థపరిచారు. అరుణ అనే లంబాడి తెగకు చెందిన ఆమె ప్రార్థనకు వచ్చేది. ఆమె పిల్లలు సండేస్కూల్‌కి వచ్చేవాళ్ళు. పిల్లల్ని శ్రద్ధతో పంపేది. ఆమెకు సువార్తకు అంత శ్రద్ధ చూపేది కాదు. అన్య పండుగలు ఆచరించేది. వాళ్ళ అమ్మ వాళ్ళు విగ్రహారా ధికులు కాబట్టి ఆమె అంతగా యేసయ్య గురించి చెబితే పట్టించుకునేది కాదు. కాబట్టి నేను కూడా ఆమెను గురించి పట్టించుకునేదాన్ని కాదు. కానీ నా స్వంత ప్రార్థనలో దేవుడు ఆమెను గూర్చి జ్ఞాపకం చేసేవాడు. కాబట్టి ఆమె గురించి ప్రార్థిస్తుండేదాన్ని. కొన్ని రోజులకు రోజూ ప్రార్థన లకు వచ్చి బాప్తిస్మం తీసుకొని బలంగా తయారైంది. అనేక మంది నేను పొందిన శ్రమలను కళ్ళారా చూచినవారు దేవుడు నా పక్షంగా ఉండి నా సమస్త ఉపద్రవముల నుండి విడిపించాడు అని తెలుసుకొని ప్రార్థనకు వస్తూ విశ్వాసులైరి.

ఒక అమ్మాయి రిబ్కా (రాధిక) మా సంఘానికి వస్తుంది. ఆ అమ్మాయి ఉద్యోగం కోసం ప్రార్థించగా దేవుడు ఆ అమ్మాయికి వెలుగు ఆఫీసులో అకౌంటెంట్‌గా ఉద్యోగం వచ్చింది. జీతం 2000/-. పోయిన నెల తన

మొదటి నెల జీతంలో పులిపిర్ చేయించింది.

లక్ష్మారెడ్డి అనే వ్యక్తి క్రొత్తగా రక్షించబడ్డాడు. ఆ వ్యక్తి చాలా త్రాగుబోతుగా ఉండేవాడు. త్రాగుడు మానేసినందుకు ఆయన పనిచేస్తున్న యజమానుడు కోపగించి నువ్వు క్రైస్తవ మతంలోకి ఎందుకు పోయావు? ఆదివారం కూడా పనికి రావాలని బాధపెట్టుచున్నందున నేను స్వంతంగా ట్రాక్టర్‌ను కొనుక్కుంటాను అని ఆయన దగ్గర పని మానేశాడు. ట్రాక్టర్ కొరకు ప్రయత్నించగా లోన్‌లో ట్రాక్టర్ వస్తే ఒక్కరోజు నేను పనిచేసిన డబ్బులు కానుకగా ఇస్తా అని ప్రార్థన చేసు కున్నాడు. ఆయనకు ట్రాక్టర్ వచ్చింది.

మేము మంచినీళ్ళ పంపు వేయించాలకున్నాము. కనెక్షన్ కొరకు డబ్బు కట్టి ఒక్క సంవత్సరం అయింది. మా ఇంటి దగ్గర నుండి దాని కనెక్షన్ మూడు వందల గజాల దూరం త్రవ్వి పైపు వేయడానికి రూ. 1800 అడిగాడు ఒక వ్యక్తి. నేను సరే అన్నాను. అతను, అతని భార్య వచ్చి త్రవ్వుతున్నారు. ఆయనతో మేము గజంన్నర లోతు తోడాలి అన్నాము. ఆయన జానెడు లోతు తోడి ఇంతే తోడేది అన్నాడు. తగాదా వేస్తున్నాడు. అంతలో లింగారెడ్డి భార్య మా ఇంటికి వచ్చి మేము కూడా పంపు వేయించుకుంటాము. మన ఇద్దరం కలిసి తోడిద్దాము. చెరిసగం డబ్బు వేసుకుందామని అన్నది. 'మాకు స్థలం అమ్మవద్దు' అని 'ఎక్కడి నుండో వచ్చి ఇక్కడ ఇల్లు కడతారా!' అన్న వ్యక్తి ఆ లింగారెడ్డి. నాకు ఆశ్చర్యం కలిగింది. ఆ తోడే వ్యక్తి నేను తోడను అని మధ్యలో పని విడిచి వెళ్ళిపోయాడు. నేను చాలా దిగులుపడ్డాను. సంవత్సరం నుండి పెండింగ్ పడ్డ పని మధ్యలోనే ఆగి పోయింది. సగం తవ్వి వెళ్ళాడు. అందులో ఎవరైనా పడతారేమో! ఎవరితో ఏ గొడవ అవుతుందో అనుకుంటూ ప్రభువా! ఎప్పుడు పనిలో ఇలా జరుగలేదు. ఇది ఏంటి? అని చాలా భయంతోను, దిగులుతోను ఉన్నాను. మరుసటి రోజు ప్రొద్దునే ఆశ్చర్యం! ఆ లింగారెడ్డి జె.సి.బి. మాట్లాడు కొచ్చి దానితో తోడిపి స్తున్నాడు. ఇప్పుడు నాకు సగం బాధ తప్పింది. తవ్వకం కోసం మాట్లాడిన వ్యక్తికి అప్పుడప్పుడు కొంత కొంత డబ్బులుగా రూ. 1800 ఇస్తానన్నాను. మరి జె.సి.బి.కి ఎన్ని డబ్బులు అవుతాయో అన్ని డబ్బులు నా దగ్గర లేవు, ఎలా? అని మరలా ఆలోచిస్తున్నాను. జె.సి.బి. తోడుతుండగా మా ఎదురింటి వాళ్ళు మేము కూడా కలుస్తాము. ముగ్గురం కలిసి తోడిద్దాము, ముగ్గురం పాళ్ళు వేసుకుందాము అన్నారు. కొంచెం ఊపిరి పీల్చుకున్నట్లు అయింది. అయినా మా సంఘానికి వచ్చే రిబ్కాని వెయ్యి రూపాయలు అడిగి తీసుకొన్నాను. అయినా ఆ డబ్బు ఆ అమ్మాయి ఆఫీసు డబ్బు. నేను ఆమె అడిగినప్పుడు ఇవ్వలేకపోతే బాగుండదు. ఎలా? అనుకుం టున్నాను. ముగ్గురికి పైపులు అమర్చారు. మరలా మట్టి పూడ్చడానికి ట్రాక్టర్‌తో పూడ్పించారు. ఇవన్నీ మా వలన అయ్యే పనులు కాదు. నేను ఇలాంటి పనులు చేసుకోలేను. ముగ్గురి మీద రూ. 3000 ఖర్చు వచ్చింది అన్నారు. నా వరకు రూ. 1000 అయింది. పంపు కనెక్షన్ ఇచ్చే మున్సిపాలిటి వ్యక్తికి 480 రూ. బిల్లు అయింది. మొత్తం 1500 రూ. మాత్రమే నాకు వచ్చింది. దేవునికి స్తోత్రములు కలుగును గాక! సామెతలు 16:7 ఒకని ప్రవర్తన యెహోవాకు ప్రీతికర మగునప్పుడు ఆయన వాని శత్రువులను సహా వానికి మిత్రులుగా చేయును. అవును దానియేలును సింహాల గుహలో వేసినప్పుడు వాటి నోరు మూయించింది నీవే కదా! అని ఆయనవైపు చూశాను, చూస్తున్నాను. ఆయన దృష్టికి ప్రీతికరంగా ఉండటమే నా ప్రయత్నం. ఆ రోజు సాయంత్రం అనగా రోజు ఇంట్లో సాయంత్రం 7:30ని ప్రార్థన జరిగే సమయంలో మార్తా, మరియమ్మ అనే వాళ్ళు 2,100రూ. తీసుకొచ్చి ఇది దశమ భాగము అమ్మా! ప్రార్థించండి అని ఇచ్చారు. మామూలుగా ఆదివారం ఆరాధనలో ఇచ్చేవాళ్ళే! కానీ ఆ సమయంలో ఇవ్వడం ఆశ్చర్యం అనిపించింది.

ప్రభువు నా అక్కరలో వెంటనే తన ద్వారాలు తెరిచి నాకు సహాయం చేశాడు. ఆనాడు పూర్తి జీతం నా చేతిలో ఉన్నప్పటి కంటే ప్రభువు చిత్తంలో ఆయన చేతిలో నా పర్స్ ఉండడమే నాకు మేలైంది. ఎంత కష్టం వచ్చినా ఖచ్చి తంగా దశమభాగం తీస్తాను. ఆయన వాగ్దానం చొప్పున నాకు సహాయం చేస్తున్న నా ప్రభువుకు కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తున్నాను.

# మదర్ తెరీసా

మదర్ తెరీసా జీవితంలో యేసుప్రభువు ప్రణాళిక ఏమైయున్నదో పరిశీద్దాం. ప్రతి మానవుని పట్ల దేవునికున్న మహోన్నతమైన ప్రణాళిక ఎంతో గొప్పది మరియు మన ఊహకందనిది. జగత్తు పునాది వేయబడక మునుపే దేవుని ప్రేమచేత మనలను క్రీస్తులో ఏర్పరచుకొనెను. తల్లి గర్భము నుండి బయలు పడకమునుపే మదర్ తెరీసాను ప్రతిష్ఠించి గొప్ప సేవకురాలుగా యేసుప్రభువు ప్రేమను లోకములో వ్యాప్తి చేయు మంచి సాధనంగా నియమించెను.

మదర్ తెరీసా యుగొస్లావియాలోని స్కోపియె అనే ఊరిలో ఆగష్టు 26, 1910న జన్మించినది. మదర్ తెరీసా అసలు పేరు ఆగ్నెస్ గోన్‌షా బొయావు. ఆగ్నెస్ తండ్రి నికోలస్ బొయావు. ఆయన ఇటలీ దేశస్థుడైన మోర్టన్‌తో కలసి వ్యాపారం చేసేవాడు. ఈజిప్టు, ఇటలీల నుండి ఆహార పదార్థములు, బట్టలు, లెదర్‌గూడ్స్ అమ్మడం, కొనడం చేసేవారు. నికోలస్ దయార్థ హృదయుడు. ఆయన తన స్నేహితులందరిలో ప్రముఖుడు. ఆయన ఇల్లు ఎప్పుడూ అతిథులతో కళకళలాడుతూ వుండేది. ఆగ్నెస్ తల్లి డ్రాణాఫిలి బెర్నాయ్. కఠినమైన క్రమశిక్షణాపరురాలు మరియు అమిత ప్రేమామయురాలు. ఆగ్నెస్ అక్క అగాతా. 8 సం॥లు పెద్దది. అన్న లాజర్, 3 సం॥లు పెద్దవాడు. వీరందరూ ఒక గొప్ప విలాసవంతమైన ఇంటిలో నివసించేవారు. ఆగ్నెస్ కుటుంబం క్రైస్తవ మతంలోని కథోలిక్ సంఘానికి చెందినవారు.

ఈ లోకంలో ఎవరైనా సరే ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చదిద్దబడాలంటే అందుకు అనువైన పరిస్థితులు మూడు. మొదటిది తల్లి పెంపకం, రెండవది తండ్రి మాదిరి, మూడవది ఉపాధ్యాయ ఉద్బోధ. ఈ మూడు ఎవరి జీవితంలో సమపాళ్ళలో సమ్మేళనమవుతాయో వాని వ్యక్తిత్వం ఉన్నత శిఖరాలను చేరుకుని తనకు మాత్రమే కాక తానున్న సమాజానికి ప్రయోజనకరమవుతుంది. ఆగ్నెస్ తల్లి మతనిష్ఠ కలిగిన క్రైస్తవురాలు. పిల్లలకు ప్రతిరోజు బైబిలు వాక్యాలు చెప్పి ప్రార్థనలో నడిపించేది. క్రమశిక్షణ బోధించేవారు. ఆమె ఎక్కువ సమయం పేదలకు సేవ చేయుటలో గడిపేది. ఆమె క్రమం తప్పకుండా పేదలను దర్శించి వారికి ఆహారము, డబ్బు సహాయం చేస్తుండేవారు. ఈ సమయాల్లో ఆగ్నెస్ తల్లితో వెళ్తుండేది. చిన్నతనం నుండే పేదలపట్ల ఆమెకు ప్రేమ వుండేది. మదర్ తెరీసా తన బాల్యములో తల్లి దగ్గర నేర్చుకున్న విషయాలను చెబుతూ, వారికి దేవుని ప్రేమించటం, పొరుగువారిని ప్రేమించడం అనే విషయాలు తమ తల్లివద్ద నేర్చుకున్నట్లు చెప్పారు. ఆగ్నెస్ వినయ విధేయతలలో, పరిశుభ్రతను పాటిస్తూ ఇతరులకు సహాయ కారిగా వుండేది. తల్లితోపాటు చర్చీకి వెళ్లి ఇద్దరు కలసి ప్రార్థన చేస్తుండేవారు. ఆగ్నెస్ తండ్రి వ్యాపారరీత్యా దూర ప్రాంతాలకు వెళ్లి వస్తుండేవాడు. తల్లిదండ్రులిరువురు ఒకరి నొకరు బహుగా ప్రేమతో నుండెడివారు. బిడ్డలను అమితంగా ప్రేమించేవారు. చిన్న కుమార్తె అయిన ఆగ్నెస్ అనారోగ్యంగా, సన్నగా ఉండటం తండ్రిని బాధించేది. ముగ్గురు పిల్లలకు ఆ తండ్రి చెప్పేదేమంటే మీరు బయట ప్రపంచంలో తిరిగే టప్పుడు మీరు ఎవరిపిల్లలో మరిచిపోవద్దు. మన కుటుంబ గౌరవాన్ని భంగపరచేలా ఉండకూడదని బోధించేవాడు. ఇలాంటి వాతావరణంలో ఆగ్నెస్ పెరిగింది. ఆగ్నెస్ 8 సం॥రాల వయసులో హఠాత్తుగా తండ్రి మరణావస్థలో వుండగా ఆగ్నెస్ తల్లి, ఆగ్నెస్‌ని తొందరగావెళ్లి ఫాదర్‌ని పిలుచుకురమ్మని పంపింది. ఆ చిన్నప్రాయంలో ఆగ్నెస్ చర్చీ వరకు పరుగుతీసింది. అక్కడ ఫాదర్ లేడు. త్వరలో రైల్వేస్టేషన్‌లో దిగుతారని తెలుసుకుని అక్కడకు పరుగెత్తింది. అక్కడ చర్చీ ఫాదర్‌గారు కనిపించలేదు గాని, వేరే ఫాదర్ కనిపిస్తే ఏ మాత్రం సంశయించకుండా ఆయన్ని ప్రాధేయపడి చనిపోతున్న తన తండ్రి వద్దకు తీసు కొచ్చింది. కీర్తన 51వ అధ్యాయం చదివి, ప్రార్థన చేసిన తరువాత నికోలస్ బొయావు చనిపోయాడు. అప్పుడు ఆయనకు 45 సం॥ల వయస్సు. ఆ రోజు పట్టణంలోని దుకాణాలన్నీ మూసివేసి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆయన అంత్యక్రియలు జరిగించారు. ఆయన గురించి తన తల్లి, మరెందరో మంచి విషయాలు చెబుతుంటే ఆగ్నెస్ హృదయంలో తన తండ్రి

యింత మంచివాడని హృదయంలో సంతోషించేది. తండ్రితో ఉన్నవారు, తల్లి బంధువులు ఆ కుటుంబాన్ని మోసపరచి వారికేమీ లేనివారిని చేశారు. ఆ పరిస్థితుల్లో ఆగ్నెస్ తల్లి ఏమాత్రం అధైర్యపడకుండా దేవునిపై భారముంచి ముగ్గురు పిల్లల్ని సంరక్షించే బాధ్యతను స్వీకరించారు. బట్టలు, తివాచీల వ్యాపారాన్ని మొదలుపెట్టి ముందుకు సాగిపోతూ తన ముగ్గురు పిల్లలకు ఏ లోటూ కలుగకుండా పెంచింది. ఆగ్నెస్ తండ్రి చనిపోయిన తరువాత అక్కచెల్లెండ్రు ఎక్కువగా చర్చీలో గడుపుతూ చర్చీ కార్యక్రమాల్లో ఉండేవారు. ఆగ్నెస్ 12 సం॥ల వయసులో తాను మఠకన్యగా వుండి తన జీవితాన్ని దేవునిసేవకు అంకితం చేయాలనే ఆశను వెలి బుచ్చినప్పుడు తల్లి అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఎందుకంటే చిన్నతనం కదా అనుకుంది. యేసుక్రీస్తు సలిపిన సిలువయాగంలోకి సాత్వికం, సేవ, సమత, సుహృద్భావం ఆగ్నెస్‌కు ఎంతో ఇష్టమైన ప్రతిబింబాలు. వాటితోనే తన జీవిత భవిష్యత్తుకు పునాదులు వేసుకుంది.

ఆగ్నెస్ 14 సం॥ల వయసులో చర్చి ప్రీస్ట్‌గా వున్న ఫాదర్ జద్రియా స్థానంలో మరో జెసూట్ ఫాదర్ జంబ్రకోవిచ్ క్రొత్తగా ప్రీస్ట్‌గా చేరినారు. క్రొత్తగా వచ్చినవారు కొన్ని క్రొత్త విషయాలు అమలుచేయటం పరిపాటి. బాలురకు, బాలికలకు అనేకమైన కార్యక్రమాలు మొదలుపెట్టారు. బాలికలకు సొడాలిటి అనే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఫాదర్ జంబ్రికోవిచ్ బాలికలతో సెయింట్ ఇగ్నిషియస్ లయోల గారు స్థాపించిన "సొసైటీ ఆఫ్ జీసస్" గురించి, వారి సేవా కార్యక్రమాలను గూర్చి బోధించారు. సెయింట్ ఇగ్నిషియస్ లయోలగారి కాలంలోనే మరోక జసూట్ ఫాదరైన సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ జేవియర్‌గారు ఇండియాలో చేసిన సేవ ఆగ్నెస్‌ను ఎంతో ఉత్తేజపరచింది. సెయింట్ ఇగ్నిషియస్ లయోలగారి మాటల్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని సొడాలిటిలో వున్న బాలికలకు చెప్పారు. "ఇంతవరకు క్రీస్తు కొరకు ఏమి చేశాను? ఇప్పుడు క్రీస్తు కొరకు ఏమి చేస్తున్నాను? ఇకముందు క్రీస్తు కొరకు ఏమి చేయాలనుకుంటున్నాను?" ఈ మాటల్ని ఆగ్నెస్ తన జీవితమంతా హృదయంలో పదిలపరచుకొని, గుర్తుచేసు కుంటూ ఆవిధంగా చేసేవారు. ఫాదర్ జంబ్రకోవిచ్ గారికి మిషనరీ సేవ అంటే ఎంతో ఇష్టం. ఆయన ద్వారానే ఆగ్నెస్ హృదయంలో సేవా విత్తనాలు నాటబడ్డాయి.

ఆ రోజుల్లో యుగొస్లోవియా దేశానికి చెందిన జెసూట్ మిషనరీలు బెంగాల్, గంగా డెల్టా ప్రాంతాలలో సేవచేస్తూ ఉండేవారు. వారిలో ఆంథోని అనే మిషనరీ డార్జిలింగ్ ప్రాంత మందు సెయింట్ మేరి వేదాంత కళాశాలలో విద్యనభ్యసించేవారు. ఇండియాలో జరిగే సేవ గురించి తరచుగా యుగొస్లావియా మిషనరీలకు, మిషనరీ సంస్థలకు ఉత్తరాలు వ్రాస్తూ వుండేవారు. బెంగాలులో జరిగే సేవా వివరాలను అందించే ఆ లేఖల్ని ఆగ్నెస్ అత్యంత ఆసక్తితో చదివేది. ఆ లేఖల ద్వారా జెసూట్ మిషనరీలు చేస్తున్న స్వచ్ఛంధ సేవలోని విశిష్టతను ఆకలింపు చేసుకుంది. ఒక్కొక్క లేఖ ఒక్కొక్క పాఠాన్ని నేర్పింది. భారతదేశాన్ని సందర్శించి, సేవ చేయాలని మనసులో నిర్ణయించుకుంది. ఒకరోజు జెసూట్ మిషనరీ ఇండియా నుండి వచ్చి ఆగ్నెస్ వెళ్ళే చర్చీలో అక్కడ జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి వివరించినపుడు ఆమె ఎంతో సంతోషించింది. మిషనరీలు చేస్తున్న సేవ వివరాల్ని అడిగి తెలుసుకుంది. ఆ సమయంలో తన తల్లితో తన నిర్ణయాన్ని చెప్పినప్పుడు తన తల్లి ప్రోత్సహిస్తూ ఈ విధంగా చెప్పింది. "నీవు ఏమైనా మొదలుపెడితే హృదయపూర్వకంగా మొదలుపెట్టాలి. లేకుంటే అసలు మొదలు పెట్టవద్దు. నా ఆశీస్సులు ఎప్పుడూ నీకుంటాయి. కాని ఎప్పుడూ దేవుని సేవ కొరకు ప్రాకులాడుతూ, యేసుక్రీస్తు ప్రభువు కొరకే జీవించాలి". అప్పుడు ఆగ్నెస్ చర్చి ప్రీస్ట్‌గారిని అడిగింది "నేను దేవుని పిలుపును ఎలా తెలుసుకోగలను? ఆయన పిలుపు ఏమైయున్నదో తెలుసుకొనుట ఎట్లు?"అని. అప్పుడా ప్రీస్ట్‌గారు ఏమన్నారంటే "నీ మనసులోని సంతోషం నీవు ఒక సిస్టర్‌గా సేవకు సమర్పించుకొని దేవునికి, ప్రజలకు సేవ చేయటానికి సంతోషపడితే అదే దేవుని పిలుపు అనుకోవాలి. నీ అంతర్గతంలో ఉప్పొంగుతున్న సంతోషమే దేవుడు నిన్ను నడిపించే దిక్సూచిగా అనుకోవాలి, కష్టాలపాలు చేసినా అదే నిజమైన పిలుపు అనుకోవాలి" అని చెప్పారు.

**(సశేషం)**

# తల్లిదండ్రులారా!

వేసవి సెలవులు వస్తున్నాయంటే భయపడే తల్లి దండ్రులు కొంతమంది ఉంటారు. 40 రోజులు ఇంట్లో పిల్లలు చేసే గోల తప్పించుకోడానికి పిల్లలని తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మల ఇళ్ళకో, బంధువుల ఇళ్ళకో పంపించే స్తుంటారు. అలా కుదరకపోతే ఇంట్లో టీ.వి.కో, సెల్‌ఫోన్‌కో, ఆటవస్తువులకో అలవాటు చేస్తుంటారు. సంవత్స రమంతా స్కూలుకి వెళ్తారు కదా, ఈ సమ్మర్‌లో పిల్లలని ఎంజాయ్ చెయ్యనివ్వండి అనుకుంటుంటారు. పిల్లలు స్కూల్లో మంచి ర్యాంక్ సంపాదించాలని కోరుకోని పేరెంట్స్ ఎవరూ ఉండరు. అందుకోసం మనసు పెట్టి పిల్లల గురించి ఆలోచి స్తారు. ట్యూషన్స్ చెప్పిస్తారు, ఆదివారం కూడా స్కూలుకి పంపిస్తారు. 24 గంటలలో నిద్రపోయేటప్పుడు తప్ప మిగతా సమయమంతా వాళ్ళ చదువు గురించే. ఎందుకంటే, అది వాళ్ళ భవిష్యత్ కాబట్టి. ఆ క్రమంలో పిల్లలు పడే కష్టాన్ని చూసి పేరెంట్స్ జాలిపడినా అది భవిష్యత్తుకి సంబంధించిన విషయం కాబట్టి గుండె రాయి చేసుకుంటారు. ఈ లోక జ్ఞానము వెఱ్ఱితనమని బైబిలు చెప్పినా, చదువు అవసరమే కాబట్టి, పిల్లలను చదివించాలి. కానీ, దేవునికి దూరమయ్యే స్థాయిలో పిల్లల మీద చదువుని రుద్దకూడదు. చదువు మోజులో పడి బిడ్డలని దేవునికి దూరం చేయడాన్ని దేవుడు ఒప్పుకోడు. *"చిన్నబిడ్డలను నా యొద్దకు రానియ్యుడి; వారినాటంకపరచవద్దు దేవుని రాజ్యము ఈలాటి వారిదే"* *(మార్కు 10:14)* అని యేసుప్రభువు చెప్పినా, తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. ప్రతిఒక్కరి 'భవిష్యత్తు' దేవుని చేతిలో ఉంటుంది. కానీ, పిల్లల భవిష్యత్తుని మాత్రం తల్లి దండ్రులు వారి చేతుల్లోకి తీసుకుంటారు. బిడ్డల భవిష్యత్తుని దేవుని చేతిలో పెడదామని 'క్రైస్తవ' తల్లిదండ్రులు సైతం అనుకోవడం లేదు. అలాగని బిడ్డలని దేవునికి వదిలేసి అసలు పట్టించుకో కూడదని కాదు. ఈ లోక సంబంధమైన చదువు గురించి ఎంత ఆసక్తి చూపిస్తారో, పిల్లలు దేవుని జ్ఞానములో ఎదగటానికి ఇంకా ఎక్కువ ఆసక్తి చూపించాలి. ఎందుకంటే ఈ లోకజ్ఞానము మనుష్యులను పాపము చేయ కుండా అడ్డుకోదు. కేవలం దేవునియందలి భయభక్తులు మాత్రమే మనుష్యులను క్రమమైన మార్గములో ఉంచుతుంది. *"బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు" (సామెతలు 22:6).* ఈ వాక్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత ముందుగా తల్లిదండ్రుల మీదనే ఉంటుంది. చిన్నబిడ్డలని ఇప్పుడు దేవునిలో పెంచకపోతే ఇంక ఎప్పటికీ సాధ్యంకాదు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు' కాకుండా, బిడ్డలు మీ ఆధీనంలో ఉన్నప్పుడే వారి హృదయంలో **'దేవుడు'** అన్న భావనని కలుగజేయండి. ఈ వేసవి సెలవులలో మీ బిడ్డల మీద మీ దృష్టి కేంద్రీకరించండి. వారానికి ఒక గంట సండేస్కూలుకి, సంవత్సరానికి 4 రోజులు వి.బి.యస్‌కి పంపినంత మాత్రాన ఉపయోగం లేదు. *"మీరు ఈ నా మాటలను మీ హృదయములోను మీ మనస్సులోను ఉంచు కొని... నీవు నీ యింట కూర్చుండునప్పుడు... పండుకొను నప్పుడు లేచునప్పుడు వాటిని గూర్చి మాటలాడుచు వాటిని* ***మీ పిల్లలకు నేర్పి****..." (ద్వితీయో. 11:18,19).* కూర్చున్న ప్పుడు, పండుకొనునప్పుడు, లేచునప్పుడు మీ పిల్లలకు నేర్పమని దేవుడే చెప్తున్నాడు. ఇప్పుడు మీ బిడ్డల భవిష్యత్ మీ చేతుల్లో ఉంది. దేవుడిచ్చిన బహుమానమైన మీ పిల్లలకు ఏమి నేర్పాలనుకుంటున్నారు? దేవుని గురించా? లోకము గురించా? పిల్లలను గారాభంగా పెంచే క్రమంలో వారి మానసిక స్థితిని గురించి పట్టించుకోము. వారు కొంచెం కూడా బాధపడకూడదు అన్న క్రమంలో వారు అడిగినవన్నీ చేయడానికి సిద్ధపడతాము. ఒక్కోసారి అది దుష్పరిణామాలకి దారి తీస్తుంది. అలా అలవాటు చేయడం వలన వారు కోరుకున్నది తల్లిదండ్రులు చేయనప్పుడు అలగటం, అన్నం మానేయడం, ఏడవటం చేసి సాధించుకుంటారు. ముఖ్యంగా చిన్నప్పటి నుండి వారికి **'డబ్బు'** అలవాటు చేయడం వలన వారికి దేవునికంటే డబ్బే ముందుగా పరిచయం అవుతుంది.

డబ్బు లేనిదే ఏమి జరగదు అన్న భావన వారికి చిన్నతనం లోనే ఏర్పడుతుంది. డబ్బులు ఇవ్వనిదే స్కూలుకు వెళ్లకుండా మారాం చేస్తుంటారు. కాబట్టి వారి జీవితాలలో **'దేవుని'** కంటే డబ్బు ప్రాధాన్యత పెరిగి పోతుంది. విశ్వాసులైన క్రైస్తవ కుటుంబాలలో కూడా **'దేవుని'** మీద ఆధారపడి జీవించడం నేర్పడమనేది చాలా అరుదుగా ఉంటుంది. బిడ్డల చదువు విషయంలో చూపించే వ్యక్తిగతమైన శ్రద్ధ దేవుని విషయంలో చూపించరు. దేవుని విషయంలో తమ బిడ్డలను సండే స్కూలుకి పంపించడంతోనే తమ బాధ్యత తీరిపోయింది అనుకుంటారే తప్ప, వారు దేవుని విషయంలో ఎంత ఆసక్తిగా ఉన్నారు? వారికి ఉన్న బైబిలు పరిజ్ఞానమెంత? దేవునిపట్ల వారు ఎలాంటి అభిప్రాయం కలిగి ఉన్నారు? అనేంత లోతుల్లోకి వెళ్ళరు. ఎందుకంటే, దేవునిపట్ల తల్లి దండ్రులకే సరైన అవగాహన ఉండదు. చిన్నబిడ్డల విషయంలో దేవుడు ఎలాంటి వైఖరి కలిగి ఉన్నాడో తల్లి దండ్రులకు తెలియదు. చిన్నబిడ్డల విషయంలో యేసు ప్రభువు మాట్లాడుతూ, *"నాయందు విశ్వాసముంచు ఈ చిన్నవారిలో ఒకనిని అభ్యంతరపరచు వాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచి వేయబడుట వానికి మేలు... ఈ చిన్నవారిలో ఒకడైనను నశించుట పరలోకమందున్న మీ తండ్రి చిత్తము కాదు. (మత్తయి 18:6,14).* చిన్నబిడ్డలను దేవునిలో పెంచకపోతే వారు నశించిపోతారు. వారు నశించి పోవడం పరలోకమందున్న దేవుని చిత్తము కాదు అని చెప్తూ, చిన్నబిడ్డలను దేవుని యొద్దకు నడిపించకుండా ఉండేవారి పట్ల చాలా కఠినంగా మాట్లాడాడు. చిన్నబిడ్డలను అభ్యంతర పరచే వారి మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టి మిక్కిలి లోతైన సముద్రములో పడెయ్యాలని చెప్పాడు. చిన్నబిడ్డలకు దేవున్ని పరిచయం చేసి, వారిని దేవుని దగ్గరకు నడిపించని వారెవ రైనా సరే, తల్లిదండ్రులే కానీ, సంఘకాపరే కానీ, సండే స్కూలు టీచరే కానీ, అలాంటి వారు దేవుని చిత్తానికి వ్యతిరే కంగా చేస్తున్నారని, అందుకు వారే బాధ్యత వహించాలని అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా బిడ్డల విషయంలో మంచైనా, చెడైనా దేవునికి లెక్క అప్పగించవలసిన బాధ్యత కేవలం తల్లిదండ్రుల మీదనే ఉంటుంది. 'సమయం' అన్నది చాలా విలువైనది. *"దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసీ. 5:15).* కాబట్టి తల్లిదండ్రులారా, సమయమును పోనియ్యక, ఈ వేసవి సెలవులలో మీ బిడ్డలు దేవుని జ్ఞానము సంపాదించులాగున తగిన ప్రణాళికలు వేసుకొని, జ్ఞానులవలె నడుచుకొనుచు సమయమును సద్వినియోగము చేయగలరు. ఈలాగు చేయడం దేవుని చిత్తమై యున్నది.

**(సశేషం)**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# ప్రార్థనా జీవితము

'హన్నాకృప' పాఠకులకు, మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీకందరికి నా శుభములు.

ప్రార్థన – మానవునికి దేవునికి మధ్య గొలుసు వంటిది. ప్రార్థన పరలోక ధనాగారమును తెరచు తాళపుచెవి. వేవేల ఆశీర్వాదములకు ప్రార్థనయే మూలము. గాలి పీల్చుకొనుట, ఆహారము తినుట మానవ శరీరమునకెంత అవసరమో ప్రార్థన ఆత్మీయ జీవితానికి అంతకంటె ఎక్కువ అవసరం. "ప్రార్థన అనగా చూడగల కళ్ళను మూసుకొని, అదృశ్యమైన వస్తువులను చూడగల కన్నులను తెరచి, హృదయ కోరికను దేవుని తట్టు త్రిప్పి, ఆత్మకును దేవునికిని మధ్య చేయు సంభాషణయు సహవాసమును చేయుట (కీర్తన 50:15). ప్రార్థన ద్వారా దేవుడు మనకు వాగ్దానము చేసిన వాటి కొరకై అడిగి, వెదకి, తట్టి పొందుకొనగలము . ప్రార్థించక పోవుట పాపముగా దేవుడు ఎంచును. "నా మట్టుకు నేను మీ నిమిత్తము ప్రార్థన చేయుట మానుట వలన యెహోవాకు విరోధముగ పాపము చేసిన వాడనగుదును" (1సమూయేలు 12:23). వ్యక్తిగతముగా మనకు మనమే పాపము చేసిన వారమగుదుము. దైవగ్రంథమునందలి చిన్న లేఖన భాగమును చదివి, దానిపై కొంత సమయం ధ్యానించి, నీ పరలోకపు తండ్రితో సహవాసం చేయుచున్నావనియు, నీవు ప్రార్థించు స్థలమునందు నీతోకూడ సర్వంతర్యామియైన త్రియేక దేవుడున్నాడనియు విశ్వసించవలెను. ఆరంభంలోనే వేగిరపాటుతో మాట్లాడుటకు తొందరపడక మనస్సును, హృదయమును ఆయనయందు లక్ష్యముంచి వేచియుండ వలెను. హడావిడిగా ఏవో కొన్ని మాటలు పలికి లేచి పోరాదు. అట్టి స్థితియందు పరిశుద్ధాత్మ దేవుడు మన తలంపులలోను, క్రియలలోను ఏదైన పాపముందని తెలియ జేసిన యెడల దేవుని యెదుట ఒప్పుకొని, మానవుల ఎదుట సరిచేసుకోవాలి. ప్రార్థన మరియు ధ్యానము ఒకదానికి ఒకటి మిళితమై యున్నది. ప్రార్థనలో ఆయన చేసిన ఉప కారములను తలంచుచు, అనుగ్రహంచబడిన ప్రార్థనా జవాబులకై దేవుని స్తుతించుము. స్తుతించుట యేసుక్రీస్తు నందు, మన విషయమందు దేవుని చిత్తమును, శోభస్కరమునై యున్నది (1థెస్స. 5:12). ప్రార్థించే స్థలము కూడ ప్రాముఖ్యం. బైబిలు ప్రకారం చూచినచో రహస్యముగా నొక గదియందు ప్రార్థించవలెనని మత్తయి 6:6లో చూడగలము. అయితే ఏదో యొక స్థలములో తప్పక పరలోకపు తండ్రితో సహవాసం చేయుటకు నీకొక రహస్య ప్రార్థనా స్థలము న్నదా? విశ్వాసి జీవితమున ఉదయ కాలము ప్రార్థించుటకు మంచి సమయము. తెల్లవారు జామున అబ్రాహాము లేచి దేవుని సన్నిధిని నిలిచెను (ఆది. 8:27). వేకువనే లేచి యాకోబు దేవుని ఆరాధించెను (ఆది. 26:18).

ప్రియ విశ్వాసీ వేకువనే లెమ్ము, మోకాళ్ళపై పట్టుదలతో వెదకి, ఆయనకు సమయమిచ్చి దిన జీవితంలో సాతానుపై జయము నొందుము. పరిశుద్ధాత్మ దేవుడు మన ఆత్మయందు తీవత్ర కల్గించి, మనలను ప్రార్థనా పరులనుగా చేయును.

సాతాను మనలను ముఖాముఖిగా ఎదుర్కొనలేక, రకరకాలైన పనులు ద్వారా మనలను వేరే మార్గములకు తరలించును. పరిశుద్ధులను ప్రార్థింపకుండా దూరపర్చును. సాతాను మన ప్రార్థన లేని స్థితిని చూచి నవ్వును, మన జ్ఞానమును చూచి ఎగతాళి చేయును. అయితే దేవుని బిడ్డలు ప్రార్థించినప్పుడు వణకును. భూలోకమంతటిలో అనేక గొప్ప కార్యములు జరుగుటకును, దేవదూతలు తమ రెక్కలను చాచి మరింత శక్తతో పని చేయుటకును, దేవుడు చక్కని ప్రత్యుత్తరముల నిచ్చుటకు పరిశుద్ధుల ప్రార్థనలే కారణము. ఇట్టి గొప్ప ఆయుధమును దేవుడు గొప్ప కార్యములను సాధించుటకును, ఆశ్చర్యకరమైన ఫలములను పొందుటకును పరిశుద్ధుల హస్తములలో నుంచెను. ప్రార్థనను నీ జీవితములో ఆరంభించుటకు అనుకూలమైన సమయము కొరకు వేచియుండక, నేడు అను సమయమున్న ఈ దినముననే ప్రారంభించుము. దేవుడు తన కుమారుని యొక్క ప్రార్థన ఆత్మను మనకందరికి దయచేయును గాక! ఆమేన్.

**–ఇట్లు డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

# నా కుటుంబము



**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

దేవుడు మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదమని తన స్వరూపమందు నరుని సృజించెను. దేవుని స్వరూపమందు వాని సృజించెను. స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను. ఎట్లనగా 'మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోబరుచుకొనుడి' అన్నాడు. కనుక వెంటనే వారు పిల్లలను కనటం మొదలుపెట్టారు.

వారు పండు తినక ముందు మానవులకు మరణం లేని రోజుల్లో ఆదాము హవ్వలకు వారి పిల్ల పిల్లలకు ఎంతమంది సంతానమో, ఎన్ని సంవత్సరాలు గడిచాయో తెలీదు. వారే దేవుని పిల్లలు, పాపమెరుగని పిల్లలు.

పండు తినిన తర్వాత దాదాపు 2000 సం॥లు గడిచిన తర్వాత అబ్రాహాము కథ ప్రారంభమైనది. అబ్రాము భార్యయైన శారాయి అతనికి పిల్లలను కనలేదు. అబ్రామునకు దేవుడు సంతానం ఇవ్వలేదు అనలేదు. ఇక్కడ సంతాన హీనతకు కారణం అబ్రాము కాదని స్పష్టంగా కనబడుతుంది. అబ్రాముకు శారాయి పిల్లలను కనలేదు. ఆమెకిష్టం లేదు. మనస్ఫూర్తిగా పిల్లలు కావాలని కోరలేదు. లేక తన అందం పోతుందని అనుకున్నదేమో. లేక పరాయి దేశాలలో ప్రాణ రక్షణలేదని అనుకున్నదేమో. ఏది ఏమైనా ఆమె పిల్లలను కనలేదు.

40 సం॥ల క్రితం ఆసుపత్రిలో కడుపు కోసి బిడ్డను బయటకు తీసే సాంప్రదాయంలేని రోజులలో, దేవుని భయం డాక్టర్లకి నర్సులకు ఉన్న రోజులలో, పదివేలమందిలో ఒక్కరికి కడుపు కోసే రోజులలో దేవుని మీద క్రైస్తవులకు విశ్వాసం ఉండి బిడ్డలు దేవుని వలన బహుమానంగా ఇవ్వబడతారని, పుట్టించిన దేవుని శక్తివలననే కుటుంబాలు నడుస్తుండే రోజులలో, ఒకామె తొలి కాన్పుకు ఆసుపత్రికి తీసుకొని వెళ్ళారు. ఆమె చాలా గంటలు నొప్పులు పడుతూనే ఉంది. అక్కడున్న వైద్యురాలిని "కాన్పు కష్టమా?" అడిగాను. "నో.. షి ఈజ్ నాట్ కోపరేటింగ్" అని అంది. అంటే కాన్పు కావటానికి తల్లి సహకరించటం లేదు అని చెప్పింది.

కుటుంబ దీవెనకు భార్యాభర్తలు ఒకరికొకరు సహకరించాలి. పిల్లల సంగతి తర్వాత. ముందు కుటుంబమును ఒక క్రొత్త కుటుంబమును ఈ లోకంలో ఏర్పడటానికి భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరు సహకరించుకోవాల్సిన అగత్యం ఎంతో ఉంది. భార్యాభర్తలు ఒకరికొకరు ఎలా పలకరించుకొని ఎలా సహకరించుకుంటారో పిల్లలు కూడ అదే బాణీలో వ్యవహరిస్తారు.


భార్యాభర్తలుగా కలిసిన కుటుంబంలో సంవత్సరాలు గడచే కొలది దేవుని వలన బహుమానంగాను స్వాస్థ్యంగాను బిడ్డలను పొందిన తరువాత ఏర్పడిన కుటుంబం సంవత్సరాలు గడచి బిడ్డలు ఎదిగి మొదటి బిడ్డ విద్య కొరకు గాని, ఎదిగి వివాహం చేసుకొని వేరైనప్పుడు కుటుంబంలోని మాధుర్యం తగ్గిపోతుంది.

బిడ్డలు పుట్టిన తర్వాత వారు చిన్నవారై వారికి వారుగా మంచి చెడ్డలను ఎరిగిన తరువాత తల్లిదండ్రుల అజమాయిషి అవసరం లేదన్న అభిప్రాయం కలిగిన తర్వాత కుటుంబంలోని మాధుర్యం తగ్గిపోతుంది.

సాధారణ, సహజమైన పరిస్థితులలో కూడ బిడ్డలు దూరమైన తర్వాత కూడ ఏ కుటుంబం నుండి వారు ఉద్భవించారో ఆ కుటుంబం యొక్క లక్షణాలు వారి వెంట తీసుకొని వెళ్తారు. కనుక పెద్దపిల్లలకు 18 సం॥లు రాకముందే ఏదైనా కుటుంబం అని పిలువబడుతుంది. **(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - జూన్-2025

**ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో ఎంత కాలము నివశించిరి?** (నిర్గమకాండము)




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కిడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు.......................................................

పేరు..........................................................

గ్రామము................బుక్ సీరియల్ నంబరు...........

### సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

### చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (06-12-24) | 3000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| పి.వి.కెరోలిన్, గుంటూరు | (11-12-24) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| జయ, గుంటూరు | (06-03-24) | 1500 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి.మాణిక్యమ్మ అనంతపురం | (25-03-24) | 1000 |
| గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) | | 1000 |
| కె. రజిని, నరసరావుపేట | | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (25-12-24) | 500 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (10-11-24) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-10-24) | 500 |
| యం. విల్సన్, నెల్లూరు | (14-09-24) | 500 |
| కె. ఆదిలక్ష్మి, డిస్ట్రిక్ట్ లైబ్రరి, ఒంగోలు | (24-09-24) | 500 |
| కె. ఐజక్‌సుకుమార్, ఒంగోలు | (14-08-24) | 500 |
| ఆర్. దేవికుమారి, పర్చూరు | (20-05-24) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (13-12-23) | 500 |
| బి. పరంజ్యోతి, హైదరాబాద్ | (11-12-23) | 500 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (24-11-23) | 500 |
| కె. నైటింగేల్, నెల్లూరు | (11-11-23) | 500 |
| శాంతాగ్రేస్, మచిలీపట్నం | (06-01-23) | 500 |
| వి. కస్తూరి, భీమవరం | | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |
| ఆర్.ఆర్.కె.పీటర్-విశాఖపట్నం | (23-03-25) | 350 |
| పి. జాన్‌బాబు-గోపాలపురం | (21-03-25) | 350 |
| ఎ. ప్రభుచరణ్-జగిత్యాల | (19-03-25) | 350 |
| పి. నీలిమారాజారత్నం, ఉయ్యూరు | (14-03-25) | 350 |
| యస్. గోపి, పార్వతిపురం | (17-12-24) | 350 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (20-11-24) | 350 |
| బి. జయరావు, బుచ్చిరెడ్డిపాలెం | (06-11-24) | 500 |
| కె. రాబర్ట్ ప్రభాకర్, ఉదయగిరి | (03-10-24) | 350 |
| వై. జోసఫ్, భీమవరం | (04-10-24) | 350 |
| జి. క్యాథరిన్, ఒంగోలు | (08-10-24) | 350 |
| వి. రత్నమ్మ, హైదరాబాద్ | (17-10-24) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (12-09-24) | 350 |
| కె. ఉదయకుమారి, కాకుమాను | (02-08-24) | 350 |
| జె. రాజేష్, ఒంగోలు | (06-07-24) | 350 |
| సిహెచ్. శైలజ, విజయవాడ | (04-04-25) | 200 |

చిన్నపిల్లల పేజి

# దేవుని సహాయం

అనుకోకుండా దొరికిన సెలవులను ఎలా ఎంజాయ్ చేయాలా అని ఆలోచిస్తున్న జాన్ హడావిడిగా లేచి సెయిలింగ్‌కి కావలసిన సామాగ్రిని సర్దుకుని సముద్ర విహారానికి బయలుదేరాడు.

సముద్రంపై వెళ్తుండగా తాకిన చల్లని గాలి, సముద్రము, వాతావరణాన్ని ఆస్వాదిస్తూ చాలా దూరం వెళ్ళగా అకస్మాత్తుగా సముద్రంపై తుఫాన్ రావడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. జాన్ బోట్ తిరగబడి, అలల దెబ్బలకు బోట్ పగిలిపోసాగింది. జాన్ సముద్రంలో దూకి ఈదసాగాడు. తుఫాన్ కారణంగా చుట్టూ చీకటి ఏమి కనిపించడం లేదు. ఏలాగోలా పగిలిన ఓడ ముక్కను పట్టుకొని ఈదసాగాడు. రాత్రంతా ఈదడం వలన అలసి నీరసంతో నిద్ర పట్టేసింది జాన్‌కి. కళ్ళు తెరిచేసరికి సముద్ర తీరం కనబడడంతో జాన్‌కి తిరిగి ప్రాణం వచ్చినట్లయింది.

జాన్ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. అది ఒక ద్వీపము. చుట్టూ సముద్రము ఉండి ప్రపంచంతో సంబంధం లేని విడువబడిన భూభాగము. అక్కడ నుండి బయటపడాలి అంటే అటుగా వచ్చే ఏదైనా నౌక తనకు సహాయం చేయడం తప్ప వేరే మార్గం లేదు. అక్కడ నుండి ఎలా అయిన బయట పడాలని రెండు మూడు రోజులు ఆ తీరం వెంబడే కూర్చుని ఏదైనా నౌక వస్తుందేమో తనకు సహాయం దొరుకుతుందేమో అని ఎదురు చూడసాగాడు, సహాయం చేయమని ప్రార్థించ సాగాడు. కానీ లాభం లేదు. జాన్‌కి సహాయం దొరికే అవకాశం లేదని అర్థమైపోయింది. ఇక ఆ ఐలాండ్‌లోనే బ్రతకడానికి సిద్ధపడి, చెక్కముక్కలతో ఒక చిన్న గుడిసెను కట్టుకున్నాడు. తీరానికి కొట్టుకువచ్చే వస్తువులను సేకరిస్తూ అక్కడ దొరికే దుంపలు తింటూ జీవించడం అలవాటు చేసుకోసాగాడు. ఇన్నికష్టాలలో కూడా దేవుని నిందించక తన ప్రాణాలు రక్షించినందుకు దేవునికి వందనాలు చెల్లించి అక్కడ నుండి బయట పడేందుకు సహాయం పంపమని అనుదినం ప్రార్థించేవాడు.

ఒకరోజు జాన్ తన ఆహారం కొరకు వెళ్ళి వచ్చేసరికి తనకున్న చిన్న గుడిసె మంటల్లో కాలిపోతు కనిపించింది. జాన్‌కి దుఃఖం ఆగలేదు. దేవునిపై కోపం వచ్చింది. ఇది పూర్తిగా అన్యాయం దేవుడా, నేనేం చేసానని నన్నిలా పరీక్షిస్తున్నావు? అంటూ దేవునిపై తన కోపాన్ని ప్రదర్శించి ఏడుస్తూ ఆ తీరం వెంబడే నిద్రపోయాడు. కళ్ళు తెరిచి చూసేసరికి కనుచూపు మేరలో ఒక నౌక తన వైపు రాసాగింది. జాన్ ఆనందానికి హద్దులు లేవు. కల అనుకున్నాడు, కానీ నిజంగానే నౌక జాన్‌కు సహాయం చేయడం కొరకే వచ్చింది. నౌక ఎక్కిన తరువాత జాన్ అసలు నేను ఇక్కడ ఈ ఐలాండ్ ఉన్నానని మీకెలా తెలిసింది అని అడిగాడు నౌక నాయకుణ్ణి. నీవు ఇచ్చిన సిగ్నల్ ఆధారంగానే అన్నాడు నాయకుడు. సిగ్నలా? నేనేమి సిగ్నల్ ఇవ్వలేదే, ఆ ప్రయత్నం కూడా చేయలేదే అన్నాడు జాన్ అమాయకంగా. ఈ ప్రాంతం నుండే ఆకాశంలోకి పొగ లేవడం చూసి ఎవరో సహాయం కొరకు అర్థిస్తున్నారని గుర్తించి ఇక్కడకు వచ్చాము అన్నాడు నౌక నాయకుడు. వెంటనే జాన్‌కి తన గుడిసే కాలిపోవటం గుర్తొచ్చింది. ఈ నౌకను తన దగ్గరకు పంపుటకే దేవుడు తన గుడిసెను తగులబెట్టాడు అని గ్రహించగానే జాన్ కళ్ళ వెంబడి కన్నీళ్ళు ధారగా కారాయి.

దేవుడు మన జీవితంలో చేసే పనులు మనకు కష్టంగా, నష్టాలుగా అనిపిస్తాయి కనిపిస్తాయి. కానీ దేవుడు మనకు మేలు కరమైనదే జరిగిస్తాడు. ఈ విషయాన్ని గ్రహించిన వారు ఆయన మీద ఆధారపడిన వారు ఎటువంటి చింత లేక సంతోషంగా జీవిస్తారు.

***దేవుడు మనకు ఆశ్రయమును దుర్గమునైయున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు. కీర్తనలు 46:1***

# మీరు బైబిలంతా చదివేశారా?

దేవుడు మానవులకు ఇచ్చిన గొప్ప వరం బైబిలు గ్రంథము. ప్రపంచంలో మొదటిసారిగా ముద్రింపబడినది బైబిలు. ప్రపంచంలోనే అనేక భాషలలో, ఎక్కువ ప్రతులు ముద్రింపబడినది బైబిలు. ఈ భూమ్మీద మనం జీవించినంత కాలంలో మనల్ని సరైన మార్గంలో నడిపించేది బైబిల్ మాత్రమే. మనం దేవుని గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే బైబిల్ ద్వారానే తెలుసుకోగలం. చాలామంది గంటల తరబడి ప్రార్థన చేస్తారుగాని, బైబిలు ఎక్కువగా చదవరు. ఒకవేళ చదివినా ఏదో మన అవసరానికి చదువుతారే కాని, దేవుని గురించి తెలుసుకోవటానికి చదవరు. చాలామంది వాళ్ళ జీవితంకాలంలో ఒక్కసారన్నా బైబిలును పూర్తిగా చదవలేక పోవటం చాలా శోచనీయం. చాలా భక్తిగల క్రైస్తవులకు సైతం బైబిలు ఒకసారి పూర్తిగా చదువుదామన్న ఆలోచన కూడా రాకపోవడం విచారించదగ్గ విషయం. మనం ఒకరోజులో ఎంత సమయం వృధా చేస్తున్నామో ఆ సమయంలో కొంత సమయం బైబిలు చదవటానికి కేటాయించినా బైబిలు పూర్తిగా చదవటం ఏమంత కష్టం కాదు. మనకు కష్టం వచ్చినప్పుడో, మనం అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడో బైబిలు చదవటం కాదు, ప్రతిరోజూ కొంత సమయం బైబిలు చదవటానికి కేటాయించాలి. ప్రతిరోజూ మనం సెల్‌ఫోన్ ఉపయోగించ డానికి, టీ.వి. చూడటానికి, ఆటలు ఆడటానికి ఎంత సమయం వెచ్చిస్తు న్నామో, ఎంత సమయం వృధా చేస్తున్నామో మనకు తెలుసు. మనం దేవున్ని పరిశీలనగా తెలుసుకోవాలంటే అది బైబిలు చదవటం ద్వారానే తెలుసుకో గలము. కానీ సాతాను మనల్ని ఆ పని చెయ్యనియ్యదు. ఈనాడు అనేకమంది క్రైస్తవులు చెప్పున్న కారణం బైబిలు అర్థంకావటం లేదని. ఆసక్తి లేకుండా చదివితే ఏదీ మనకు అర్థం కాదు. దేవుని గురించి పరిశీలనగా తెలుసుకోవాలన్న ఆసక్తితో చదివితే దేవుడు మనకు తప్పక సహాయపడతాడు. మీరు ఇప్పటి వరకు బైబిలు పూర్తిగా చదవకపోయినట్లయితే నేడే ప్రారంభించండి. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూల సమయం, ఇదిగో ఇదే రక్షణ దినము" 2కొరింథి. 6:2. బైబిలు పూర్తిగా చదవటాన్ని ఒక సవాలుగా తీసుకొని చదవటం ప్రారంభించండి. వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రారంభించండి. ఒకసారి త్వరగా పూర్తిచేసిన తర్వాత మరలా నిదానంగా అర్థం చేసుకుంటూ చదవండి. బైబిలును ఆదికాండం నుండి ప్రారంభించి ప్రకటన గ్రంథము వరకు క్రమంగా చదవండి. అంతేకాని ఉదయం పాత నిబంధనలో సాయంత్రం క్రొత్త నిబంధనలో చదవకూడదు. బైబిలు త్వరగా పూర్తి చేయుటకు దేవుడు మీకు సహాయము దయచేయును గాక! ఆమెన్!!

## బైబిల్ పద వినోదము-5 జవాబులు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| మై | దా | న | ము | చీ | మ | ఆ | బ | భా | ప | అ | క | ట్టు | ట | శి |
| లి | అ | ష్షూ | రు | రీ | అ | రం | గె | ష | న | ని | మి | తీ | ఆ | ఖ |
| చీ | వే | గో | షే | సె | ర్వ | భ | రా | అ | సె | సీ | దో | ను | హే | ర |
| కా | ట | పు | బ | రూ | క్ష | ము | రు | రా | జ | బా | హ | అ | తు | ము |
| ల్బు | గా | ర | ఖీ | గు | దు | పె | జ | ఏ | ళ్ళు | తా | రు | మా | రు | శ్రీ |
| ట | డు | ము | తీ | ఇ | అ | లె | ఇ | ని | ఎ | ష | ఆ | టం | క | ము |
| మే | శి | రి | ప్ర | యొ | యె | గు | టి | మ్రో | రె | షే | ల | హు | వీ | ఎ |
| లీ | షా | వీ | యా | క్తా | హో | లి | క | దు | కు | స | అ | ప | లు | కు |
| షీ | నా | రు | ణ | ను | వా | శా | లు | ఫ | అ | స | పా | రా | అ | ఓ |
| ఖి | రి | లీ | ము | శి | రీ | మ | అ | చె | ద | ర | గొ | ట్టు | ట | గీ |
| లో | జా | ఓ | అ | గ | క | క్ర | ని | త | కు | అ | గ | అ | అ | మ |
| కో | తు | ఫీ | గో | ము | ను | రా | వా | ట | లు | ఏ | బె | రు | ణ | ట్టి |
| క్తి | లు | రు | మె | ణ | సె | ప | స | ర | ప | సి | లా | ఈ | శ్రీ | కీ |
| మా | ను | ట | రు | ట్ట | రె | అ | ము | ద | యూ | మ | అ | షా | కూ | లు |
| గీ | అ | డు | సు | ప | వం | శ | ము | లు | బా | బె | లు | థ | జ | షు |

**జవాబులు పంపినవారు :**

1. బి. ప్రేమలత- నెల్లూరు, 2. గంటా జార్జి థామస్-దుగ్గిరాల, 3. సత్యశైలజ- బొమ్మూరు, 4. కె. ప్రణీత-నందిగామ, 5. దయరాజు- రామానుజపురం, 6. బి. సరోజిని- గుంతకల్లు, 7. పి. ప్రభుకుమార్- ఒంగోలు, 8. ఆర్. జయమ్మలాబాను- గుంతకల్లు, 9. యం. విక్టర్‌పాల్ -పెద్దాపురం, 10. జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు, 11. క్రిస్టియానమ్మ- నందికొట్కూరు, 12. వై. సంధ్యారాణి -ఒంగోలు, 13. పి. విజయకుమారి- ఒంగోలు,

# బైబిల్ పద వినోదం - 06

## అబ్రాహాము

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించకూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | బ్రా | ము | క | మి | స | ఉ | అ | ఇ | స్సా | కు | శా | ర | యి | సిం |
| కు | ఫీ | కో | లు | వి | ల్కా | ప్పు | బ్రా | సో | కు | లె | మె | బీ | అ | ధూ |
| క | షా | ఇ | సి | శ్వా | క | స్తం | హా | య | స | ర్వ | శ | క్తి | లు | ర |
| ల్దీ | లే | ష్మా | ద్దీ | స | రు | భం | ము | రు | చ | అ | స | అ | ష్కో | వృ |
| యు | ము | యే | ము | ము | వు | అ | ట | త | సు | న్న | తి | నీ | ఎ | క్ష |
| లు | కై | లు | లో | ము | ల | తె | ర | హు | అ | తి | అ | ల | తి | ము |
| న | లో | ట | య | మ | మ | ఎ | లీ | యె | జె | రు | ను | ర్దా | యొ | వ |
| తు | రీ | న | గ | క్ర | ఐ | గు | ప్తు | అ | గ్ని | జ్వా | ల | ఊ | అ | ప్రా |
| గం | ధ | క | ము | అ | ప | ణ | వా | ర | సు | డు | స | డ | జు | ర్ధ |
| న | అ | సొ | దొ | మ | గొ | మొ | ఱ్ఱా | అ | ఎ | గ | తా | ళి | రా | న |
| షూ | ఏ | అ | గ్ని | ఛ | ము | ప | ర | బే | తే | లు | త | శా | తి | బ |
| అ | రు | ఈ | అ | మ | ద | వ | రు | మ | రు | వి | విం | ల | ళ | యి |
| హా | ని | బం | ధ | న | ర్వా | అ | గ | అ | తీ | ను | న | దు | హా | అ |
| వ | రా | లు | మో | త | శీ | ట | హా | స | అ | నా | మ్మె | ము | స్థ్య | స్వా |
| ఊ | రు | ను | అ | రే | ఆ | పా | త | క | ము | క | ను | నా | హో | రు |

పేరు......................గ్రామము......................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు......................

**'బైబిలు పద వినోదము-06'** పూర్తి చేసిన తర్వాత ఈ పేజీని ఫోటో తీసి అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకుండా పంపిస్తే, వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | |
|---|---|---|---|---|
| తెరహు | ఆశీర్వాదము | సోయరు | ఇష్మాయేలు | షూరు |
| ఫీకోలు | వారసుడు | అబ్రాము | సింధూరవృక్షము | మిల్కా |
| సున్నతి | ఎలీయెజెరు | నాహోరు | హాయి | ఎష్కోలు |
| ఉప్పుస్తంభం | నీతి | హారాను | బేతేలు | ఊజు |
| సిద్దీములోయ | విందు | నిబంధన | ఊరు | ప్రార్ధన |
| అక్రమము | ఎగతాళి | ఇస్సాకు | కల్దీయులు | కరువు |
| అగ్నిజ్వాల | పాతకము | సర్వశక్తి | శారయి | ఐగుప్తు |
| హాగరు | అగ్ని | విశ్వాసము | స్వాస్థ్యము | లోతు |
| యొర్దాను | శారా | గంధకము | నమ్మెను | కనాను |
| సొదొమగొమొఱ్ఱా | అబ్రాహాము | అబీమెలెకు | షాలేము | మోరే |